

ఉత్తమ గురువులకు పురస్కారం

జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న భీమిలి మండలం చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు పక్కి నాగేశ్వరరావు, పెదగంట్యాడ మండలం గంగవరం జెడ్పీ ఉన్నత పాఠశాల+2లో కెమిస్ట్రీ ఉపాధ్యాయుడు పాల గుమ్మి రాజారావు, ఎస్‌జీటీ కేటగిరీలో భీమిలి మండలం ముద్దాడపేట ఎంపీపీ స్కూల్‌కు చెందిన సువ్వారు రాజేంద్రప్రసాద్. చిత్రంలో విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్, వైద్య ఆరోగ్య శాఖా ఖఖా మంత్రి సత్యకుమార్ వున్నారు.







హరహర మహాదేవ...



కార్తీకమాసం రెండో సోమవారం కావడంతో జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఎంవీపీ కాలనీలోని పార్వతీ ముక్తేశ్వరస్వామి ఆలయంలో శివలింగాలకు అభిషేకాలు చేశారు.

బడ్జెట్ ఆశాజనకం

జిల్లాకు భారీగా కేటాయింపులు

మెడ్‌టెక్ జోన్‌కు రూ.172 కోట్లు

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు రూ.210.91 కోట్లు



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)



మెడ్‌టెక్ జోన్

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక రాజధాని విశాఖపట్నానికి ప్రాధాన్యం లభించింది. అయితే ప్రధానంగా ప్రస్తావించి, వెల్లడించాల్సిన అంశాలను విస్మరించారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. విశాఖపట్నం పర్యాటక రాజధాని. ప్రత్యేకించి నిధులు కేటాయించకపోయినా ఈ శాఖ ద్వారా రూ.322 కోట్ల పనులు చేపడతామని ప్రకటించారు. పెండింగ్ ప్రాజెక్ట్‌లకు ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించినందున ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆగిపోయిన పనులు పూర్తవుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. బడ్జెట్ కేటాయించినందున విశాఖ ఉత్సవ్, భీమిలి ఉత్సవ్, అరకు ఉత్సవ్‌లు నిర్వహించనున్నారు.

- జంతుప్రదర్శన శాలలకు రూ.3 కోట్లు
- ప్రాంతీయ గ్రంథాలయం అభివృద్ధికి రూ.50 లక్షలు
- మేహాద్రిగెడ్డలో సోలార్ పవర్‌కు రూ.6 కోట్లు
- ఏపీ స్టడీ సర్కిల్‌కు రూ.8 కోట్లు
- నగరంలో అంధులకు ప్రత్యేక హోమ్
- పోలీస్‌స్టేషన్లలో మౌలిక వసతులకు రూ.58 కోట్లు

రాష్ట్రంలో విశాఖపట్నం, తిరుపతి జంతు ప్రదర్శన శాలలకు రూ.3 కోట్లు కేటాయించారు. దీనివల్ల విశాఖ జూలో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంది.

ఏపీ మెడ్‌టెక్ జోన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ నేపథ్యంలో రూ.172 కోట్లు కేటాయించారు. మరిన్ని పరిశోధనలు జరిగి, కొత్త వైద్య పరికరాలు అందుబాటులోకి వస్తాయి.

విశాఖపట్నం - చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ఈ సారి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. రకరకాల పద్దుల కింద నిధులు కేటాయించారు. ఇందులో జీవీఎంసీ తరఫున ఖర్చు చేయడానికి రూ.46.32 కోట్లు చూపించారు.

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో 3 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్ట్

... మిగతా 6వ పేజీలో

విశాఖ ఉక్కును విస్మరించారు



రాష్ట్రంలో అతి పెద్ద పరిశ్రమ విశాఖపట్నం స్టీల్ ప్లాంటు. దానిని కాపాడుకోవడానికి ఈ ప్రాంత ప్రజలు పోరాడుతున్నారు. ప్రభుత్వం దానిపై ప్రకటన చేయలేదు. మెట్రో రైలు, గిరిజన వర్సిటీ, గిరిజన కార్పొరేషన్ తదితరాల అభివృద్ధికి ఏమి చేయనున్నారో చెప్పలేదు. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా బడ్జెట్‌లో సవరణలు చేయాలి.

- అజ శర్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

సంక్షేమం, మౌలిక వసతులకు పెద్దపీట



ఎన్నికల హామీ మేరకు సంక్షేమం, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసేలా బడ్జెట్ కేటాయింపులున్నాయి. రాజ్యాంగబద్ధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీలకు నిధులు వచ్చాయి. గత ఐదేళ్లలో ఈ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగింది. సూపర్‌సిక్స్, ఇతర పథకాలకు నిధులు కేటాయించారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ ఉంది.

- పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా...



స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రవేశపెట్టిన బడ్జెట్. రాష్ట్రాన్ని అభివృద్ధివైపు పరుగులు పెట్టించేలా ఉంది. వ్యవసా య రంగానికి భారీగా కేటాయించారు. మౌలిక వసతులు కల్పన, జలవనరులశాఖ, సాగులో ఆధునిక విధానాలను ప్రో త్సహించేలా ఉన్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. ద్రవ్యలోటున్నా భవిష్యత్తు ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు చేశారు. పరిశ్రమలు, ఉన్నత విద్యకు మరిన్ని నిధులిచ్చి ఉంటే బాగుండేది.

- ప్రొఫెసర్ ఎం.ప్రసాదరావు, ఎకనామిక్స్ విశ్రాంత విభాగాధిపతి

ప్రైవేటు పెట్టుబడులతోనే ఆదాయం



ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక మొత్తం కలిగిన బడ్జెట్ ఇదే. రూ.2.94 లక్షల కోట్లు. రెవెన్యూ లోటుతో పాటు ఆర్థిక లోటుంది. ఈ నేపథ్యంలో పన్నులు పెంచి ప్రజలపై భారం మోపకుండా, ప్రైవేటు పెట్టుబడులు సాధించి, వాటి ద్వారా పన్నుల రూపంలో ఆదాయం పెంచుకోవాలి. పారిశ్రామికవేత్తలకు రూ.పదివేల కోట్ల రాయితీ బకాయిలు ఉన్నాయి. వాటి కోసం కొంత మొత్తం కేటాయించి ఉంటే బాగుండేది.

- ఒ.నరేశ్‌కుమార్, వైజాగ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్

నగరం... కాలుష్య కాసారం!

మెషీన్ లెర్నింగ్ సాయంతో కచ్చితమైన నిర్ధారణ

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

నగరం కాలుష్య కాసారంగా మారుతోంది. కాలుష్య నియంత్రణ మండలి ఎప్పటికప్పుడు కాలుష్య తీవ్రతను లెక్కించి, హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, నివారణ చర్య లు కనిపించడం లేదు. ప్రధానంగా పీఎం 10, పీఎం 2.5తో పాటు మరికొన్ని కాలుష్య కారకాలను యంత్రాలు/ఆన్‌లైన్ మోనటరింగ్ యంత్రం ద్వారా లెక్కగడుతుంటారు. అయితే అంతర్జాతీయంగా పలు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలకు చెందిన ఐదుగురు నిపుణులు పాత డేటాను తీసుకుని మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్) అల్గారిథమ్‌లను ఉపయోగించి క్యాట్‌బూట్ మోడల్‌లో కాలుష్యాన్ని విశ్లేషించారు.

- ఐదుగురు నిపుణుల అధ్యయనం
- 2017 నుంచి 2022 వరకు నమోదైన డేటా ఆధారంగా విశ్లేషణ
- లాక్‌డౌన్ సమయంలో తగ్గి, మళ్లీ పెరిగిన కాలుష్యం

నగరంలో కాలుష్య తీవ్రతను కొలిచిన కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటాతో పోల్చితే దీనికి 0.9998 శాతం కచ్చితత్వం వచ్చింది. మలేషియాకు చెందిన గోకుల్ రవీంద్రన్, గోసిం హేదర్, ఏపీలోని రాజాం జీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ఆచార్యుడు కార్తీక్ కనగరతినం, కెనడకు చెందిన అవినాష్ అలగముత్తు, డెన్మార్క్‌కు చెందిన క్రిస్టియన్ సోన్నే చేసిన పరిశోధనా పత్రం అంతర్జాతీయ జర్నల్ చెమోస్ఫియర్ (సీహెచ్ఈఎం వోఎస్‌పీహెచ్ఈఆర్ఈ)లో ప్రచురించారు. ఎయిర్‌క్వాలిటీ స్థాయిలను కచ్చితంగా అంచనావేయడంలో కృతిమ మేధస్సు పాత్రను ఇది నొక్కి చెబుతోంది. కాలుష్య కారకాలను నియంత్రించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తూ నగరంలో ఎయిర్‌క్వాలిటీ పీఎం 10, పీఎం 2.5 ముఖ్యమైనదని విశ్లేషించారు.



ఈ విధానంలో భవిష్యత్తులో గాలి నాణ్యత, కాలుష్యం కచ్చితంగా అంచనా వేయచ్చునని ఈ పరిశోధనాపత్రం వెల్లడించింది.

గాలిలో నాణ్యతపై ప్రభావం

నగరంలో పీఎం 10, పీఎం 2.5 అత్యంత ప్రభావం చూపుతుందని అధ్యయనం ద్వారా తేలింది. ధూళికణాలు 2017 నుంచి 2019 మధ్య పెరగడాన్ని గుర్తించింది. ఇంకా నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్ వంటి కాలుష్య కారకాలు ఉన్నాయని నిర్ధారించింది. గాలిలో నాణ్యత సూచీపై వాతావరణ కారకాలు స్వల్పంగా ప్రభావం చూపుతున్నాయని తెలిపింది. నగరంలో 2017 నుంచి 2022 వరకు కాలుష్య కారకాల తీవ్రతను కాలుష్య నియంత్రణమడలి ప్రతిరోజు సేకరిస్తోంది. ఈ డేటాకు మెషీన్ లెర్నింగ్ అల్గారిథిమ్ మోడల్‌ను ఉపయోగించినట్టు పరిశోధనాపత్రంలో పేర్కొన్నారు.


ఏడాది పొడవునా అదే పరిస్థితి

నగరంలో జనవరి నుంచి మార్చి వరకు పీఎం10 సాంద్రత 100 కంటే ఎక్కువగా నమోదవుతోంది. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఇదే స్థాయిలో ఉంది. అయితే 2017 నుంచి 2019 వరకు పెరిగిన

... మిగతా 6వ పేజీలో

35 శాతమే జీతం

ఉక్కు ఉద్యోగులకు మళ్లీ కోత



- సెప్టెంబరులో 50 శాతం బకాయి
- అక్టోబరుకు మరో 15 శాతం తగ్గింపు
- నిధులున్నా చెల్లింపులపై స్పందించని యాజమాన్యం
- అరకొర జీతంతో ఎలా బతకాలంటున్న ఉద్యోగులు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు యాజమాన్యం ఉద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటోంది. ఇటీవల ఉద్యోగులకు పూర్తిగా జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా సెప్టెంబరు నెలకు 50 శాతమే జీతాలు ఇచ్చింది. అక్టోబరులో దసరా, దీపావళి పండుగలు వచ్చాయని ఉద్యోగులు ఎంత మొత్తుకున్నా పట్టించుకోలేదు. తాజాగా నవంబరు వచ్చింది. అంటే అక్టోబరు జీతాలు చెల్లించాలి. సెప్టెంబరులో బకాయి 50శాతం, అక్టోబరు జీతం పూర్తిగా ఇవ్వాల్సి ఉంది. కానీ అక్టోబరు జీతం కేవలం 35శాతం మాత్రమే ఉద్యోగుల ఖాతాకు నవంబరు 11న జమచేసింది. ఇక బకాయి జీతంపై కనీసం నోరు మెదపడం లేదు.

ప్రతి నెలా ప్లాంట్ ఉద్యోగుల జీతాల చెల్లింపునకు సుమారు రూ.86 కోట్ల నిధులు అవసరమవుతుంది. ఉద్యోగులు పనిచేస్తేనే స్టీల్

... మిగతా 6వ పేజీలో

బీఈడీ విద్యార్థుల పరేషాన్!

- రికార్డుల సబ్‌మిషన్ ప్రక్రియను మార్చిన అధికారులు
- ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్, అప్‌లోడ్ చేయాల్సి రావడంతో ఇక్కట్లు
- ఒక్కో విద్యార్థిపై రూ.3 వేల వరకు భారం
- రికార్డుల అవాల్యుయేషన్ బాధ్యతలు ప్రైవేటుకు
- పారదర్శకత లోపిస్తోందంటున్న నిపుణులు



విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ విద్యార్థుల రికార్డుల సబ్‌మిషన్ ప్రక్రియకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విద్యార్థులకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఒక్కో సెమిస్టర్‌కు ఏడు నుంచి 11 వరకు రికార్డులు సమ ర్పించాల్సి ఉంటుంది. గతంలో విద్యార్థులు నేరుగా రికార్డుల ను రాసి కళాశాలల్లోనే సబ్‌మిట్ చేసేవారు. సదరు కాలేజీలు యూనివర్సిటీలకు పంపేవి. ఈ రికార్డులను మోరేషన్ బోర్డు ఆధ్వర్యంలో అవాల్యుయేషన్ చేసేవారు. ఈ బోర్డులో ఏయూ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతితో పాటు యూజీ బీవోఎస్ చైర్మన్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్,

... మిగతా 6వ పేజీలో

శ్రీవిశ్వ జూనియర్ కళాశాలకు షోకాజ్

- హాస్టల్ నిర్వహణకు అనుమతి లేదు
- మిగిలిన ఫుడ్ తినడంతోనే బాలికలకు అస్వస్థత
- కలెక్టర్‌కు ఇంటర్‌బోర్డు నివేదిక



శ్రీవిశ్వజూనియర్ కళాశాల హాస్టల్‌లో విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

నిల్వ ఉన్న ఆహారాన్ని విద్యార్థినులకు వడ్డించిన శ్రీవిశ్వ జూనియర్ కళాశాల యాజమాన్యంపై ఇంటర్‌బోర్డు అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో కళాశాలకు సోమవారం షోకాజ్ నోటీస్ జారీచేశారు. కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్‌కు ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి మురళీధర్ ప్రాథమిక నివేదిక అందజేశారు. శ్రీవిశ్వ పాఠశాలల విద్యార్థుల ఫెస్ట్‌ను ఆదివారం మధ్యాహ్నం సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ

... మిగతా 6వ పేజీలో

అభివృద్ధి పనులపై జెడ్సీకి వినతి

ఎండాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డు వరహగిరినగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, మంచినీటి పైపుల మరమ్మతుతో పాటు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు ఎమ్మెల్యే గంటా ఆమోదం తెలిపారని టీడీపీ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి తెలిపారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆ వివరాలను జోన్-2 కమిషనర్ సింహాచలానికి అందజేశారు. అలానే పెండింగ్‌లో ఉన్న పలు పనులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు చినగోపి, తెలుగు యువత అధ్యక్షుడు ఒమ్మి బాబూరావు, పత్తి మురళీ, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సుమారు రూ. 3.3 కోట్లు విడుదల చేయాలని కార్పొరేటర్ నరసింహం కమిషనర్ సంపత్‌కుమార్‌ను కోరారు. ఆయన సోమవారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాత అడివివరం శ్మశానవాటికలో పనులకు, సింహగిరి కాలనీలో బిటి రోడ్డు నిర్మాణానికి, పద్మావతినగర్ 3వవీధిలో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి, ఎంఎంటీసీ కాలనీ అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి, కాపువీధి శివాలయం వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 3.3 కోట్లు వ్యయం అవుతుందన్నారు.

'మారని అధికారుల తీరు'

కొమ్మాది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైసీపీ ఓటమి చెంది, కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ సచివాలయ సిబ్బంది పనితీరు మారడం లేదని టీడీపీ విశాఖ పార్లమెంటరీ అధికార ప్రతినిధి, ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ విమర్శించారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో సచివాలయం సిబ్బంది వైసీపీ నాయకులతో కుమ్మక్కై కొమ్మాది రోడ్డు మాస్టర్ ప్లాన్, పీఎంపాలెం రోడ్డు మాస్టర్ ప్లాన్‌లో ఇష్టారీతిన బడ్డీలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చారన్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, ఇప్పటికీ బడ్డీలు ఏర్పాటు చేస్తున్నా స్పందించడం లేదన్నారు.

రాజా వీధిలో 'ప్రజా చైతన్య యాత్ర'

తగరపువలస, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు తగరపువలస రాజవీధి మెయిన్ రోడ్డులో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నెలలు కావస్తున్నా అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు.

'బీఆర్‌టీఎస్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి'

సింహాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాత అడివివరం కూడలి నుంచి తొలిపావంచా వరకు ఉన్న బీఆర్‌టీఎస్ సింహాచలం కారిడార్ ఫేజ్-2లో నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాశర్ల ప్రసాద్ కోరారు. సోమవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.






ఎండాడ : ప్రత్యేక అలంకరణలో పశుపతినాథేశ్వరుడు

సింహాచలం : పూజలందుకున్న చంద్రమౌళేశ్వరస్వామి

మానం ఆంజనేయులునగర్‌లో శివుడి పానపట్టంపై సూర్యకిరణాలు

భీమిలిలోని శివాలయంలో పూజలు

శివాలయాల్లో కార్తీక పూజలు

- వేకువజాము నుంచి పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివనామస్మరణ

భీమునిపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని శివాలయాల్లోనూ కార్తీక పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఒకేలా రద్దీ కొనసాగింది. భీమిలిలోని భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయం వద్ద తెల్లవారుజామున అయిదు గంటల నుంచే భక్తులు క్యూ కట్టారు. అలాగే బాలా త్రిపుర సుందరి సహిత చంద్రశేఖర ఆలయం, కొత్తపేటలో ఉన్న పురాతన శివాలయాల్లోనూ భక్తులు పూజలు నిర్వహించారు. గొల్లలపాలెం, బీచ్‌రోడ్ రామాద్రి శివాలయంలోనూ పూజలు జరిపారు.

మధురవాడ : మధురవాడ పరిసరాల్లోని ఆలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. మానం ఆంజనేయనగర్‌లోని లలిత సుందరీదేవి సమేత మహాకామేశ్వర స్వామి ఆలయంలో వేకువజామున 4 గంటలు నుంచి భక్తులు దర్శనాలకు బారులు తీరారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. మిథిలాపురి వుడాకాలనీలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా మానం ఆంజనేయనగర్‌లో ఉన్న లలిత త్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అద్భుతం చోటుచేసుకుంది. ఉదయం 6 గంటల సమయంలో శివుడికి అభిషేకాలు జరుగుతుండగా సూర్యుడి లేలేత కిరణాలు ముక్కంటి పానపట్టంపై పడడంతో భక్తులు పులకించిపోయారు. ఈ దృశ్యాన్ని చూడడానికి అధిక సంఖ్యలో క్యూ కట్టారు. వాస్తు ప్రకారం ఆలయం నిర్మించడంతో ఏటా నవంబరు 11 లేదా 12వ తేదీల్లో సూర్య కిరణాలు శివుడి పాదాలను తాకుతాయని ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేశ్ తెలిపారు.అలాగే ఆలయ ఆవరణలో ఉన్న లలిత త్రిపుర సుందరీదేవి విగ్రహం పాదాలపై కూడా సూర్యకిరణాలు ప్రసరించాయి.

ఎండాడ : జీవీఎంసీ 8, 9వ వార్డుల పరిధిలోని శివాలయాలు భక్తులతో సోమవారం రద్దీగా మారాయి. ఎండాడలో పశుపతినాథేశ్వరస్వామి ఆలయంలో వేకువజామున నాలుగు గంటల నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలానే కైలాసగిరి దిగువన ఉన్న భవానీ సమేత కైలాసగిరీశ్వర ఆలయంలోనూ, కైలాసగిరిపై ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

సింహాచలం : 98వ వార్డులోని శైవ క్షేత్రాల్లో పూజలు జరిగాయి. వేకువజాము నుండే సింహగిరిపై పవిత్ర గంగధార జలాల్లో, అలాగే కొండదిగువ వరాహ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.అనంతరం సింహగిరి క్షేత్రపాలకుడు బాలత్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలతో పాటు విజినిగిరిపాలెంలో కొలువుదీరిన ఉమా చంద్రమౌళేశ్వరస్వామి సన్నిధిలో ధ్వజ స్తంభాల వద్ద దీపారాధనలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

పద్మనాభం : పద్మనాభంలోని నారాయణేశ్వరస్వామి ఆలయం, మద్ది కాశీవిశ్వనాథుని ఆలయం, విలాస్కాన్ పాలెంలో రామలింగేశ్వరాలయం, పొట్నూరులో ఉమానీలకంఠేశ్వర ఆలయంలో పరమశివునికి ప్రత్యేక పూజలు చేశారు. కోరాడ పంచాయతీ పరిధి గెద్దపేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సహిత లక్ష్మీ గణపతి ఆలయంలో శివలింగానికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

35 శాతమే జీతం

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తి జరుగుతుంది. ఇక్కడ ఉద్యోగుల్లో 70శాతం మంది ప్రతిరోజూ 150 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన వాతావరణంలో పనిచేస్తారు. అంత కష్టపడినా వారి శ్రమను యాజమాన్యం గుర్తించడం లేదు. పూర్తిస్థాయి జీతం చెల్లించడం లేదు. పైగా కోతలు పెంచుకుంటూ పోతోంది.

35 శాతం జీతంతో బతకడమెలా?

స్టీల్‌ప్లాంటులో పనిచేసే ఉద్యోగికి సగటున కోతలు పోను రూ.40వేల జీతం వస్తుంది. అందులో సగమే చెల్లిస్తుండడం తో దానిని అలవాటు చేసుకున్నారు. అంటే రూ.20వేలు. తాజాగా 35 శాతమే ఇచ్చారు. అంటే రూ.13,500 వరకు వస్తుంది. ఈ మొత్తంతో భార్య, ఇద్దరు పిల్లలతో ఎలా జీవించాలని ఉద్యోగులు వాపోతున్నారు. యాజమాన్యం కావాలనే ఇలా చేస్తున్నదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. జీతాలు ఇవ్వని సంస్థలో పనిచేయడం మానేసి, స్వచ్ఛందంగా ఉపాధి వెదుక్కునేలా చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఉద్యోగుల సంఖ్య తగ్గించుకొని, ఆ తరువాత ప్రైవేటుకు ప్లాంటును అప్పగించాలని యోచిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

నిధులున్నా ఇవ్వడం లేదు

యాజమాన్యం వద్ద నిధులు లేని సమయంలో జీతాలు ఇవ్వకపోయినా ఆందోళన చెందలేదు. ఇపుడు బ్యాంకుల్లో మొత్తం రూ.950 కోట్ల నిధులున్నాయి. వాటిలో పది శాతం కంటే తక్కువ ఉద్యోగులకు జీతాలు ఇవ్వొచ్చు. సెప్టెంబరు బకాయి 50 శాతం ఇవ్వకుండా అక్టోబరు జీతాలు ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదు. ఎవరితో చర్చించి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారో వెల్లడించాలి. ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుంది. తక్షణమే జీతాల బకాయిలన్నీ చెల్లించాలి.

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ



మధురవాడ : సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

కళానగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు

మధురవాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వ నమోదులో భీమిలి నియోజకవర్గం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఏడో వార్డు పరిధిలోని కళానగర్‌లో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు, పిళ్లా నరసింగరావు, కానూరి అచ్చుతరావు, నాగోతి సూర్యప్రకాశరావు, అప్పలరాజు, రాము, రమణమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని 26 పంచాయతీల్లోనూ టీడీపీ సభ్యత్వ నమోదు చురుగ్గా సాగుతుంది.సోమవారం తర్లువాడలో సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాట్రాజు అప్పారావు, వార్డు మెంబరు అక్రమాని ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు : తహసీల్దార్

పద్మనాభం రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆనందరావు హెచ్చరించారు. సోమవారం ఆయన బాందేవుపురంలో ఆక్రమణకు గురైన గ్రామ కంఠం స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణదారులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించి డాక్యుమెంట్లు చూపించమని తహసీల్దార్ కోరగా ఇంటి పెద్దలు ఎవరూ లేరని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సాగి కృష్ణంరాజు, సురీడు, పైడినాయుడు మాట్లాడుతూ ఆక్రమిత స్థలంలో 20 ఏళ్ల కిందట పంచాయతీ భవనం ఉండేదని, గతంలో నలుగురు సర్పంచులు ఈ భవనంలోనే పాలనపరమైన కార్యక్రమాలు నిర్వహించేవారని చెప్పారు. అందులోనే పోస్టాఫీసు, అంగన్‌వాడీ కేంద్రం కూడా ఉండేవని వివరించారు. అనంతరం తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించి, పోలీసు బందోబస్తు మధ్య సర్వే సిబ్బందితో హద్దులు నిర్ణయించారు. విచారణ పూర్తయ్యేవరకు స్థలాన్ని వినియోగించరాదని ఆక్రమణదారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌ఐ శ్యామల, పంచాయతీ కార్యదర్శి పైడయ్య, సీఐ శ్రీధర్ ఎస్‌ఐ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



గ్రామ కంఠం స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

'మద్యం దుకాణం ఎత్తి వేయాలి'

తగరపువలస, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కూడలి నుంచి కొండపేటకు వెళ్లే రహదారిలో ఉన్న మద్యం దుకాణాన్ని ఎత్తివేయాలని స్థానికులు భీమిలి ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాసరావుకు సోమవారం వినతి పత్రం అందించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు, మహిళలు మందుబాబుల వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. దుకాణాన్ని అక్కడి నుంచి మరో ప్రాంతానికి తరలించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు సత్తిరాజు, టి.అప్పలరాజు, ఎం. శివ, పి. కన్నబాబు, జి. నరసింగరావు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

కొమ్మాది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జోన్-2 కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొడుతున్నారు. అన్ని విభాగాల అధికారులు హాజరుకావాల్సి ఉండగా కొందరు మాత్రమే వస్తున్నారు. ఈ వారం జరిగిన గ్రీవెన్స్‌కు ఇంజనీరింగ్ ఈఈ శాంతారాజు, ఆర్‌ఓ మినహా ఎవరూ హాజరుకాలేదు. దీంతో ఫిర్యాదుదారులు నిరాశతో వెనుతిరిగారు.

నగరం... కాలుష్య కాసారం!

... 5వ పేజీ తరువాయి

కాలుష్యకారకాలు 2020లో కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో, అదీ ప్రధానంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పీఎం 2.5 విలువ 40, పీఎం 10 విలువ 100 కంటే తక్కువగా నమోదైంది. లాక్‌డౌన్ ఎత్తివేసిన తరువాత ఈ రెండింటి విలువలు పరిధికి మించిపోయాయి. గాలిలో నాణ్యత నిర్ధారించడంలో ధూళి కణాలు కీలకంగా మారినట్టు పరిశోధనలో వెల్లడైంది. కేంద్ర కాలుష్య నియంత్రణమండలి నిర్ధారించిన ప్రమాణాల మేరకు పీఎం 10 విలువ 60, పీఎం 2.5 విలువ 40గా ఉండాలి. అయితే నగరంలో పలు మార్లు పీఎం 2.5 విలువ 202, పీఎం 10 312గా నమోదయింది. దేశవ్యాప్తంగా నమోదైన ప్రమాణాల కంటే విశాఖలో ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

కాలుష్య కారకాలివీ...

నగరంలో గాలిలో ధూళి కణాల స్థాయి, కాలుష్య తీవ్రతకు అనేక కారణాలున్నాయి. విశాఖ పోర్టు నుంచి బొగ్గు దిగుమతి, రవాణా, నగర శివారులో రెండు బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచి వచ్చే ధూళి కణాల వల్ల కాలుష్యం పెరుగుతోంది. ధూళి కణాలతోపాటు ఆర్సెనిక్, జింక్, క్రోమియం వంటి కాలుష్య కారకాలను వాతావరణంలో విడుదల చేస్తున్నాయి. తీరప్రాంత నగరం కావడంతో సముద్రం నుంచి వచ్చే ఉప్పు ప్రభావం ఎక్కువ. పారిశ్రామిక ప్రాంతం కావడంతో నగరంలో రోజువారీ ఉత్పత్తయ్యే బయోమాస్‌ను కాల్చడం వల్ల పొటాషియంతో కూడిన ధూళి కణాలు కమ్మేస్తున్నాయి. మెటల్, పెట్రోలియం రంగాల నుంచి వచ్చే ఉద్గారాలు, ట్రాఫిక్‌తో దుమ్మధూళి కూడా గాలిలో కాలుష్యం పెరిగేందుకు కారణమవుతోంది.

భవిష్యత్తు దిక్సూచి

మెషీన్ లెర్నింగ్ విధానంతో నగరంలో భవిష్యత్తు కాలుష్య తీవ్రతను అంచనావేయవచ్చునని పరిశోధనా పత్రం వెల్లడించింది. పారిశ్రామిక కార్యకలాపాలు కూడా కాలుష్యం పెరిగేందుకు కారణంగా పేర్కొంటున్నారు. అయితే నగరంలో ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ మెరుగుపరచాలంటే స్వచ్ఛత, శుభ్రతపై దృష్టిసారించాలని రాజాంలో జీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ఆచార్యుడు డాక్టరు కార్తీక్ అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రికల్, హైబ్రిడ్ వాహనాలను ప్రోత్సహించడం, శిలాజ ఇంధనంపై ఆధారపడడం తగ్గించే దిశగా నగరం ముందుకెళ్లాలని సూచించారు. గాలిలో ధూళి కణాలు విడుదలకాకుండా పరిశ్రమల్లో అధునాతన వాయు కాలుష్య నియంత్రణ పరికరాలు అమర్చే విధానాలు అమలు చేయాలన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కొమ్మాది, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత దీర్ఘకాలికంగా ఉన్న ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్నాయని 5వ వార్డు కార్పొరేటర్ హేమలత అన్నారు. వార్డులో రూ. 10 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో అనేక చోట్ల రోడ్లు, కాలువలు నిర్మించాల్సి ఉందని, వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం పలుచోట్ల టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మొల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాగర దుర్గ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం

పద్మనాభం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో నూతనంగా నిర్మించిన సాగర దుర్గ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, పరిషత్తు ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాసన చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తులను శిఖర కలశాలను మహిళల కోలాటం నడుమ గ్రామంలో ఊరేగించారు. తరువాత రక్షాబంధనం, ఋత్విక్ వరుణలు,యాగశాల ప్రవేశం, అఖండ దీపారాదన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

15న వరాహ పుష్కరిణిలో నదీ హారతి

సింహాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెల 15న కార్తీక పౌర్ణమినాడు కొండదిగువ వరాహ పుష్కరిణిలో నదీ హారతి నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవంలో భాగంగా ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు దేవస్థానం ఉపాలయం వేంకటేశ్వరస్వామి సన్నిధి నుంచి పల్లకిలో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకువస్తారు. తీరాన ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామివారిని దేవేరులతో ఉంచి షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఏక హారతి, ద్వయ హారతి, అష్ట హారతి, కుంభ హారతి, నక్షత్ర హారతులను పుష్కరిణికి ఇచ్చి, ప్రత్యేక నివేదనలు సమర్పించనున్నారు. భక్తులు కూడా ఒడ్డున దీపాలు వెలిగించనున్నారు.

విద్యాభివృద్ధితోనే దేశ ప్రగతి

భీమునిపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రగతి విద్యాభివృద్ధితోనే సాధ్యమని ఆకాంక్షించిన గొప్ప దార్శనికుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి అన్నారు. సోమవారం అబుల్ కలాం ఆజాద్ జయంతి పురస్కరించుకుని కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆజాద్ దూరదృష్టి వల్ల ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఐఐటీలు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ యూజీసీ వంటి కీలక సంస్థలను ఏర్పాటు చేశాయన్నారు. అంతకముందు పలువురు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్ ఆశాజనకం

... 5వ పేజీ తరువాయి

నిర్మాణానికి రూ.6 కోట్లు కేటాయించారు.

పరిశ్రమలకుప్రోత్సాహకాలు, రాయితీల కింద రూ.452.31 కోట్లు కేటాయించారు. ఇందులో ఉమ్మడి విశాఖ జిల్లాలో పాత బకాయిలు వస్తాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

క్రీడలకు రూ.100 కోట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ ఆడిటోరియాలకు నూతన హంగులు సమకూరనున్నాయి.

విశాఖలో ప్రాంతీయ గ్రంథాలయం అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించారు.

పోలీసు స్టేషన్లలో మౌలిక వసతులకు రూ.58 కోట్లు

నగరంలో పోలీస్ కమిషనరేట్‌కు కొత్త భవనం, మహారాణిపేట, సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్లకు కొత్త భవనాలు, ఆరిలోవలో ఏసీపీ కార్యాలయ భవనం నిర్మాణాలకు రూ.58 కోట్లు కేటాయించారు. నగరంలో కౌమార బాలుర వసతిగృహ భవనానికి రూ.42లక్షలు కేటాయించారు.

ఏయూకు రూ.389.34 కోట్లు

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపునకు బడ్జెట్‌లో రూ.389.34 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ.387.18 కోట్ల విడుదల చేయగా, ఈ ఏడాది రెండు కోట్లు పెరిగింది. వర్సిటీ అధికారులు రూ.500 కోట్లకు ప్రతిపాదించారు. వర్సిటీలో 3,500 మంది పెన్షనర్లు, 2,500 మంది ఉద్యోగులున్నారు. వీరికి ప్రతినెలా రూ.33 కోట్లు చెల్లించాలి.

అంధులకు హోమ్ ఏర్పాటు

విశాఖలో అంధుల కోసం ప్రత్యేకంగా హోమ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. బడ్జెట్‌లో ప్రత్యేకంగా దీనిని ప్రస్తావించారు. ఈ హోమ్‌లో ఉండే వారికి ఉచితంగా భోజనం, వసతి, వైద్యం, వస్త్రాలు సమకూరుస్తారు.

జీవీఎంసీకి రూ.20 కోట్లు

స్మార్ట్‌సిటీ మిషన్‌లో భాగంగా జీవీఎంసీకి బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించారు. మిషన్ ఫర్ డెవలప్‌మెంట్ స్మార్ట్ సిటీస్ కింద రాష్ట్రంలో వంద నగరాలను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులకు రూ.20 కోట్లు కేటాయించింది.

ఏపీ స్టడీ సర్కిల్‌కు రూ.8 కోట్లు..

రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ, తిరుపతిలో ఏపీ స్టడీ సర్కిల్స్ ఉన్నాయి. వీటి కోసం రూ.8 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. విద్యార్థులకు ఉచితంగా శిక్షణ, మెటీరియల్ అందించేందుకు ఈ నిధులు వినియోగిస్తారు.

సూపర్ సిక్స్ పథకాలకు ఆశించిన నిధుల్లేవు



సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల అమలుకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో వాటిని విస్మరించారు. సంక్షేమ పథకాలకు భారీగా కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ఉండాలి. విశాఖలో కీలక ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. గతంతో పోలిస్తే కొన్నిశాఖలకు మెరుగ్గా ఉన్నాయి. గ్రామీణ రంగంలో మౌలిక వసతుల కల్పన, వ్యవసాయానికి నిధులు పెరిగాయి.

- అడ్డాల వెంకటవర్మరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

బీఈడీ విద్యార్థుల పరేషాన్

... 5వ పేజీ తరువాయి

అనుబంధ కాలేజీలకు చెందిన కొందరు ప్రిన్సిపాల్స్ ఉంటారు. వీరు రికార్డులను అవాల్యుయేషన్ చేసి మార్కులు ఇస్తారు. ఈ విధానంలో ప్రక్రియ పకడ్బందీగా సాగేది. అయితే గత వర్సిటీ పాలకులు ఈ విధానాన్ని మార్చేశారు. తొలుత రికార్డుల అవాల్యుయేషన్ ప్రక్రియను కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారు. ప్రస్తుతం ఈ విధానంలోనూ మార్పులు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆన్‌లైన్ సమస్యలు

ప్రతి విద్యార్థికి వర్సిటీ అధికారులు ఒక లాగిన్ ఐడీ ఇచ్చారు. ఇందులోంచి రికార్డులు రాసేందుకు అవసరమైన కొన్ని బార్‌కోడ్‌తో పేపర్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ పేపర్లలో రికార్డువర్క్‌ను పూర్తిచేసి మళ్లీ అదే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒక్కో సెమిస్టర్‌కు ఏడు నుంచి 11 రికార్డులుంటాయి. ఒక్కో రికార్డులో కనీసం 50 నుంచి 70 పేపర్లుంటాయి. వందలాది పేపర్లను ఆన్‌లైన్‌లో పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాల్సి రావడం ఇబ్బందిగా మారుతోందని పలువురు వాపోతున్నారు. ఇందుకోసం భారీగా ఖర్చు అవుతోందని చెబుతున్నారు. వర్సిటీ అధికారులు పేపర్ డౌన్‌లోడ్ చేయడానికి, రికార్డులు అప్‌లోడ్ చేయడానికి కొంత సమయం ఇస్తున్నారు. అలోగా ప్రక్రియ పూర్తిచేయలేకపోతే రూ.2 వేలు వరకు జరిమానా చెల్లించాల్సి వస్తోంది. కొన్ని సార్లు కళాశాలల యాజమాన్యాలు, వర్సిటీ నుంచి సమాచారం రావడం ఆలస్యమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విధానాన్ని మార్చి గతంలో మాదిరిగా రికార్డులు రాసి కళాశాలల్లోనే అప్పగించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు. అంతేకాకుండా గతంలో వర్సిటీ మోడరేషన్ బోర్డు ఆధ్వర్యంలో అవాల్యుయేషన్ ప్రక్రియను నిర్వహించడం వల్ల పారదర్శకత ఉండేదని, ప్రస్తుతం బయటివారికి అప్పగించడం వల్ల సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలోని ఎక్కడా లేని విధంగా ఏయూలో మాత్రమే ఈ విధానం అమలుచేస్తుండడంపై మండిపడుతున్నారు.

ఆర్థికంగా భారం

విశ్వవిద్యాలయం పరిధిలో 53 బీఈడీ కాలేజీలున్నాయి. సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా ఒక్కో సెమిస్టర్‌కు ఏడు నుంచి 11 రికార్డులు సమర్పించాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఒక్కొక్కరికి కనీసం రూ.2 వేల నుంచి రూ.3 వేలు వరకు ఖర్చవుతోంది. జాప్యం జరిగి ఫైన్ చెల్లించాల్సి వస్తే మరింత భారం పడుతుంది. కొన్నిసార్లు సర్వర్ సమస్యతో డౌన్‌లోడ్, అప్‌లోడ్ కాకపోవడం వంటి ఇబ్బందులు ఎదురైతే మరింతగా జేబుకు చిల్లు పడుతోందని వాపోతున్నారు.

శ్రీవిశ్వ జూనియర్ కళాశాలకు షోకాజ్

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా పిల్లలకు బిర్యానీ, రొయ్యలు, గుడ్లు, చేపలతో భోజనం వడ్డించారు. అక్కడ మిగిలిన ఆహారాన్ని లాసన్స్‌బేకాలనీలో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల బాలికల హాస్టల్‌కు తరలించారు. రాత్రి అదే ఆహారాన్ని అందించారు. ఉదయం వండిన ఆహారం కావడంతో ఫుడ్ పాయిజినింగ్ జరిగి ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు. వారిలో ముగ్గురిని ఐసీయూలో ఉంచారు. ఇంటర్‌బోర్డు ఆర్‌ఐవో మురళీధర్ ఇతర అధికారులు ఆస్పత్రికి వచ్చి పరిశీలించారు. కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం బాలికల ఆరోగ్యం కుదుటుపడడంతో జనరల్ వార్డుకు తరలించారు. కలెక్టర్ ఆదేశాలతో సోమవారం మధ్యాహ్నం హాస్టల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు జగన్నాథరావు నేతృత్వంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కాగా లాసన్స్‌బేకాలనీలో హాస్టల్ నిర్వహణకు అనుమతిలేదని ఇంటర్‌బోర్డు అధికారుల తనిఖీలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యానికి షోకాజ్ జారీచేశారు. తదుపరి చర్యలకు ఇంటర్‌బోర్డు అధికారులు నిర్ణయించారు.



వినతులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

జీవీఎంసీకి 106 వినతులు

వెంకోజీపాలెం,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నగర వ్యాప్తంగా 106 వినతులు వచ్చాయి. మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్ కుమార్ వినతులు స్వీకరించారు. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

14 వరకు కంటి వ్యాధులపై బాలలకు అవగాహన

ఆరిలోవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో ఈనెల 14 వరకు కంటి వ్యాధులపై బాలలకు అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్లాలు పిల్లల దృష్టిపై ప్రభావం చూపనున్నందున చైతన్య పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

మద్దిలపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నేపథ్యంలో దేశ భవిష్యత్ రూపొందించడంలో ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు సి.వి.ఎస్.రవీంద్రనాథ్, జి.వి.ప్రతాప్, పోల ఉమామహేశ్వరరావు, డి.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తప్పిదాలను సరిదిద్దే బడ్జెట్ : వజ్జ

మద్దిలపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దేలా కూటమి ప్రభుత్వం రూ.2.94 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టి రాష్ట్ర పునర్నిర్మాణానికి నాంది పలికిందని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చి పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి, జలవనరులకు ఎక్కువ కేటాయింపులిచ్చి మంచి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత సీఎం చంద్రబాబు,ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కి దక్కిందన్నారు. ఇంధన రంగం, రోడ్లు-భవనాలు, ఉన్నత విద్యకు ప్రాధాన్యత కల్పించారని, బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, పోలీస్ శాఖకు ఎక్కువ నిధులు కేటాయించారని తెలిపారు.

సినిమా గైడ్

● **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిలిత (శ్రీహరిపురం),
● **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
● **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
● **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
● **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
● **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
● **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
● **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 28, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 34, క్యారెట్ 52 దొండకాయలు 30, బంగాళ దుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది)60, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230





కొత్త వెంకోజీపాలెం శివాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు, శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



హెచ్‌బీ కాలనీ ఆలయం రావి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అంతటా శివనామస్మరణ

- మార్మోగిన ఆలయాలు
- వేకువజాము నుంచి పోటెత్తిన భక్తులు
- ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యుల ఏర్పాట్లు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం రెండో సోమవారం 'హరహర మహాదేవ శంభో శంకర' అంటూ ఆలయాలు మారుమోగాయి.శివ దర్శనానికి భక్తులు బారులు తీరారు.తెల్లవారుజాము 3. గంటల నుంచే అభిషేకాలు జరిపారు. కొత్తవెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో విశేష సంఖ్యలో హాజరైన భక్తులకు ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఇతర అర్చకులు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.సామూహిక రుద్రాభిషేకాలు జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా శివ దర్శనానికి విచ్చేశారు. ప్రశాంతంగా దర్శనం చేసుకునేందుకు వీలుగా నిర్వాహకులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలు ఆకాశ దీపాలు వెలిగించారు. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, జేఈ రాంబాబు, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.. వీరికి స్థానిక గ్రామసేవాసంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, కార్యవర్గ సభ్యులు సహకరించారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు జరిపారు. అర్చకులు వెంకటాచార్యులు సాయంత్రం ఆలయ ప్రాంగణంలోనున్న ధ్వజ స్తంభం వద్ద ఆకాశజ్యోతులు వెలిగించారు. హెచ్‌బీకాలనీ, ఇసుకతోట, కేఆర్ఎంకాలనీలోని ఆలయాల్లోనూ అభిషేకాలు, అర్చనలు, పూజలు, దర్శనాలు కొనసాగాయి.

ఆరిలోవ : ఆరిలోవలోని శివాలయాలు కిటకిటలాడాయి. బాల త్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులు వేకువ నుంచి క్యూలో నిలబడి దర్శనానికి బారులు తీరారు. జీవ నదుల నుంచి తీసుకువచ్చిన జలాలు, పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలు, విభూతి, నారికేళ జలాలతో స్వామిని అభిషేకించారు. ఆలయ చీఫ్ ట్రస్టీ కృష్ణంరాజు భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. పెదగదిలిలో కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరాలయం, ఆరిలోవలోని ద్వాదశ లింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు, చినగదిలి, పెదగదిలిలోని వివిధ ఆలయాల్లో సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించారు.

పెదవాల్తేరు : పెదవాల్తేరులోని శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు బారులు తీరారు. శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిహెచ్ జ్యోతి, అర్చకులు కాశీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రామ్‌నగర్‌లో శివ లింగానికి పాలాభిషేకం

రామ్‌నగర్ : దసపల్లా హిల్స్ ఉత్కల్ సాంస్కృతిక మండలి జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో కార్తీక పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున విచ్చేసి స్వామి వారికి అభిషేకాలు చేశారు,

నేటి నుంచి పాండురంగని కల్యాణం

బీచ్ రోడ్డులోని పాండురంగస్వామి ఆలయంలో శ్రీరుక్మిణీ సమేత ప్రసన్న పాండురంగ స్వామికి కల్యాణం, వార్షికోత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ అడపా దేవుళ్ళు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

డంపింగ్ యార్డులుగా స్టీల్‌ప్లాంట్ స్థలాలు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రూ. కోట్లు విలువ చేసే స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. భవన నిర్మాణ వ్యర్థాలు, గోవుల పెంపకం, చెత్తా చెదారాలతో ఇవి నిండిపోతున్నాయి. 15, 16 వార్డుల్లోని హెచ్‌బీకాలనీ స్టీల్‌ప్లాంట్ స్థలాల దుస్థితి ఇది. రెండు దశాబ్ధాల కిందట ఈ ప్రాంతం జనావాసాలతో సందడిగా ఉండేది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇక్కడున్న ఉద్యోగులను పదవీ విరమణ వరకు క్వార్టర్‌లో ఉంచేవారు. ఆ తరువాత ఎవరికీ క్వార్టర్స్ మంజూరు చేయలేదు. ఇటీవల స్థలాలన్నీ ఆన్‌లైన్‌లో వేలంపాట నిర్వహించాలని నిర్ణయించుకుని అక్కడక్కడ ఉన్న ఉద్యోగులను సైతం క్వార్టర్స్ నుంచి ఖాళీ చేయించారు. అలా ఖాళీ అయిన క్వార్టర్స్ పడగొట్టేసి ఖాళీ స్థలాలుగా మార్చి విక్రయించేందుకు లేఅవుట్‌ల కింద రూపొందించి, క్రమసంఖ్య ఇచ్చారు. అనుకున్నట్లే ఆన్‌లైన్‌లో వేలంపాట నిర్వహించారు. దీనిలో ఒకటి రెండు స్థలాలను బిడ్డర్‌లు దక్కించుకున్నారు. మిగిలినవి మాత్రం కొన్ని కారణాల వల్ల అలానే ఉండిపోయాయి. ఇప్పుడవి చుట్టుపక్కల నిర్మాణాలు సాగిస్తున్న వారు మిగిలిన వ్యర్థాలు వేయటానికి, చెత్తాచెదారం పారేయడానికి, గోవుల పెంపకానికి వినియోగిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు దీనిపై శ్రద్ధ చూపి స్థలాలు పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



భవన వ్యర్థాలతో నిండిపోతున్న స్థలాలు

శ్రీవిశ్వ జూనియర్ కళాశాలపై చర్యలకు డిమాండ్



బాలికలను పరామర్శిస్తున్న నాయకులు

మద్దిలపాలెం,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విషాహారానికి కారణమైన శ్రీవిశ్వ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐడీఎస్‌వో నగర ఉపాధ్యక్షుడు బి.సంతోష్ డిమాండ్ చేశారు.విషాహారం సేవనం కారణంగా ఓమ్ని ఆర్కే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం ఏఐడీఎస్‌వో నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని చాలా కళాశాలల వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం కూడా అందించడం లేదన్నారు. లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేసి విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారని మండిపడ్డారు. విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులతో స్వతంత్ర కమిటీలు వేసి వసతి గృహాలు పర్యవేక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

న్యాయ కళాశాల విద్యార్థులకు పునశ్చరణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతామాణిక్యం

వెంకోజీపాలెం,నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఏయూ లాకళాశాలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు పునశ్చరణ, నూతన విద్యా సంవత్సరాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ వీసీ ప్రొఫెసర్ వి. కేశవరావు, గీతం స్కూల్ ఆఫ్ లా మాజీ డీన్ డాక్టర్ ఆర్. అనితరావ్, ఎ-హబ్ సీఈవో ఈసారపు రవి పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకువెళుతున్న భక్తులు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గవర జాతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే గౌరీ పరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సారెను సమర్పించారు. వివిధ రకాల మిఠాయిలు, పొంగడాలు, బూరెలు, అరిసెలు, పసుపు, కుంకుమలను గౌరీ పరమేశ్వరులకు తీసుకువచ్చారు. ఇసుకతోట నుంచి బాజాభజంత్రీలతో ఊరేగింపుగా మహిళలు, గ్రామ పెద్దలు సారెను తెచ్చి గౌరీపరమేశ్వరులకు సమర్పించారు. ఆలయ అర్చకులు రంపా మురళి అభిషేకం నిర్వహించి, తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, మళ్ల రవికుమార్, కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఇసుకతోట గ్రామస్థులను సత్కరించారు. సీతారామ సేవా మండలి అధ్యక్షులు సూరిశెట్టి వెంకటేశ్వరన్, మాజీ అధ్యక్షులు పెంటకోట చిన్నాబాబు, సహాయకార్యదర్శి పెంటకోట రమేష్, ఆడిటర్ సూరిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గీతంలో బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం

సాగర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ వేదికగా జవహర్ నవోదయ విద్యాలయ సమితి (జేఎన్‌వీ) ఆధ్వర్యంలో ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సోమవారం నుంచి ప్రారంభమైంది. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి నవోదయ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గీతం వర్సిటీ ఇన్‌ఛార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ విజ్ఞానానికి పరిధి లేదని,సైన్స్ సహా అన్ని శాస్త్రాలు మనిషి ఎదగడానికి ముఖ్యమని చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కె.ఎస్. కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగంలో ఎదగానికి అవకాశం కల్పిస్తే దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా, నిపుణులుగా ఎదుగుతారని తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఇ. ఉమాపతిరెడ్డి మాట్లాడుతూ దేశంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి నవోదయ విద్యాలయాలు కృషిచేస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు చిత్రాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, నవోదయ విద్యాలయం సమితి విశాఖ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వాణిశ్రీ, హాజరైన ఉపాధ్యాయులు

పుస్తకాలు లేకుండా బోధనపై అవగాహన

మద్దిలపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెం కృష్ణ కళాశాల రోడ్డులోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో నిర్వహించిన స్టడీ హబ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పుస్తకాలు లేకుండా విద్యార్థులకు బోధించే అత్యాధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన ప్రైవేటు పాఠశాలల అధినేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పలు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రీ కేజీ నుంచి 7వ తరగతి విద్యార్థుల వరకు అందరితో మాట్లాడి వారి విజ్ఞానానికి ముగ్ధులయ్యారు. ప్రాథమిక అంశాలు, భావవ్యక్తీకరణలో ప్రావీణ్యం పొందిన ప్రీ కేజీ పిల్లలు 500 ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఆశ్చర్యానికి గురిచేశారు. యూకేజీ విద్యార్థులు ప్రపంచ పటంలోని దేశ రాజధానులను గుర్తించడమే కాకుండా గణితం, ఆంగ్లంలో ప్రావీణ్యం చూపించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ మళ్ల రామునాయుడు, ప్రిన్సిపాల్ వాణిశ్రీ, మళ్ల శర్వాణి పుస్తకాలు లేకుండా విద్యార్థులకు ఎలా బోధించాలో శిక్షణ తరగతులు నిర్వహించారు.తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు ఎస్.మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు కృషి

రామ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సృజనాత్మకత, విజ్ఞానం మానసిక ఉల్లాసం పెంపొందించటానికి సందేశాత్మక చిత్రాలు దోహదపడతాయని రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 ఛైర్మన్ ముక్సూద్ అహ్మద్ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సోమవారం రాంనగర్‌లో జీవీఎంసీ పాఠశాల విద్యార్థులను మధురవాడలో సినిమా థియేటర్‌కు తీసుకెళ్లి ఉచితంగా వినోదాత్మక సైన్స్ ఫిక్షన్ సినిమా ప్రదర్శించారు. సినిమా చూసిన విద్యార్థులకు మానసిక ఉల్లాసం వెల్లివిరిసిందన్నారు. విద్య ద్వారా స్వేచ్ఛ అనే నినాదంతో విద్యార్థులు సౌకర్యవంతమైన విద్యను అభ్యసించేందుకు రౌండ్ టేబుల్ సంస్థ సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య దేవ్ సింగ్ ,నీలేష్ జైన్, యలమర్తి దినేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్‌బాల్ టోర్నీ విజేత సెయింట్ ఫ్రాన్స్ టీమ్

ఆరిలోవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ వ్యాలీ స్కూలులో నిర్వహించిన అండర్ -12 పుట్‌బాల్ టోర్నమెంట్లో విన్నర్స్‌గా సెయింట్ ఫ్రాన్స్ స్కూలు నిలిచింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఏపీ రూట్ ఛైర్‌పర్సన్ సుస్మిత, ఎస్‌డీవో జూన్ గాలేట్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోచ్ శేషమోహన్, వైస్ ప్రెసిడెంట్ రాజారావు, జోన్ ఇన్‌చార్జి రామకృష్ణ, సన్ని, బాబు పాల్గొన్నారు.

స్తంభాలపై తొలగించిన తీగెలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



స్తంభాలపై తొలగించిన తీగెలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్తంభాలపై అల్లుకున్న పొదలను ఆ శాఖ సిబ్బంది తొలగించారు. అల్లుకున్న నిర్లక్ష్యం అన్న శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఆ శాఖాధికారులు స్పందించారు. స్తంభాలపై ఉన్న తీగెల పొదులను పూర్తిగా తొలగించారు. అయితే ప్రస్తుతం సదరు విద్యుత్తు స్తంభాలపై సరఫరాను అండర్ గ్రౌండ్ సరఫరాకు మార్చామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం స్తంభాలపై సరఫరా లేదని, అయినా తీగెలను పూర్తిగా తొలగించామని చెప్పారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రజాప్రతినిధులకు శిక్షణ నేడు

పద్మనాభం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రజాప్రతినిధులకు మంగళవారం శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయకుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్యులు

ఆదర్శప్రాయుడు బ్రౌన్

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం బ్రౌన్ చిరస్మరణీయుడని ఏయూ తెలుగుశాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అన్నారు. ఏయూ తెలుగు విభాగంలో సోమవారం సీపీ బ్రౌన్ 226వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళపత్ర గ్రంథాల సేకరణ, సంస్కరణ, ముద్రణ, వ్యాకరణ రచన, నిఘంటు నిర్మాణం, రచనలు, వ్యాసాలు రాయడంలో బ్రౌన్ తెలుగువారికి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, పి.కన్నయ్య డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, జి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతను ఉన్నతంగా మలచడమే నూతన విద్యా విధానం లక్ష్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మలచడమే నూతన విద్యా విధానం లక్ష్యమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు "ఈక్విటీ డైవర్సిటీ అండ్ ఇంక్లూషన్ ఇన్ ఎన్ ఈ పీ 2020 ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ చాలెంజర్స్"ను ఆయన సోమవారం ప్రారంభించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థి కేంద్రంగా నూతన విద్యా విధానం రూపొందించారని, ఎక్కువ శాతం యువత ఉన్నత విద్యలో ప్రవేశించడం దీని లక్ష్యమని చెప్పారు. బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలికించి, విద్యార్థులు స్వయంగా నేర్చుకునే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. ఆరో తరగతి నుంచి వృత్తి విద్య భాగమవుతుందన్నారు. పాఠశాల విద్యలో మార్పులను వివరించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, మను కేంద్రీయ వర్సిటీ శాటిలైట్ క్యాంపస్ (బీహర్) విద్యా విభాగం ఆచార్యులు పి.ఎడం పాల్ పాటేటి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను విడుదల చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 33 కేవీ డెయిరీ ఫారం, సీఎంఆర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈడెన్ గార్డెన్ (నార్త్ స్టార్ అపార్టుమెంటు), సీఎంఆర్ ఫంక్షన్ హాల్, లాన్సమ్ ఇసుకతోట జంక్షన్ ప్రాంతం, పాత వెంకోజీపాలెం, జేఆర్ నగర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తం



విద్యార్థులకు నేత్ర సమస్యలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరు అప్పుఘర్ వద్ద నున్న హెలెన్ కెల్లర్ అంధుల పాఠశాలలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ ముఖ్య అతిథిగా, మరో ఆరుగురు న్యాయమూర్తులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. నేత్ర వైద్య నిపుణులు తేజ ప్రవీణ్ బృందం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించింది. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. పాఠశాల కరస్పాండెంట్ ఇ.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న టచ్ స్టోన్ ఛారిటీస్ హరేకృష్ణ మూవ్‌మెంట్ సభ్యులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంవీపీ కేంద్రంగా వివిధ సేవలందిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్, అనుబంధ సంస్థ అయిన టచ్ స్టోన్ చారిటీస్ సభ్యులు సోమవారం పరిశీలించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న 600 మంది పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వితరణ కార్యక్రమానికి నిధులు అందించింది. పెదవాల్తేరులోని శాంతి ఆశ్రమం,రామ్‌నగర్‌లోని విశాఖ సేవా సదన్ స్కూల్, ఏవీఎన్ స్కూల్‌లోని విద్యార్థులకు ఈఏడాది జులై 15 నుంచి మధ్యాహ్న భోజనాన్ని హరే కృష్ణ మూవ్‌మెంట్ అందిస్తోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో టచ్ స్టోన్ చారిటీస్ అధ్యక్షులు డాక్టర్ నిష్కించిన భక్త దాస మాట్లాడారు. గడచిన పన్నెండేళ్లుగా కేజీహెచ్ ఆసుపత్రి వద్ద రోగి సహాయకులకు, 11 నెలలుగా టాటా మెమోరియల్ ఆధ్వర్యంలోని బాబా క్యాన్సర్ ఆసుపత్రి వద్ద మూడు పూటలా టచ్ స్టోన్ చారిటీస్ భోజనం సమకూరుస్తోందని భక్తదాస చెప్పారు.

వృద్ధులకు విద్యార్థుల సేవలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మానవ సేవే, మాధవ సేవ అన్న సత్యసాయిబాబా దివ్య సందేశాన్ని అమలు చేయడంలో భాగంగా సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు వృద్ధాశ్రమాలు, దేవాలయాల్లో సోమవారం పలు సేవలందించారు. సత్యసాయి 99వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీలోని అమ్మ ఓల్డ్ ఏజ్ హోం, శివాలయంలో వృద్ధులకు పదో తరగతి విద్యార్థులు నిత్యావసర సరకులు, పారిశుద్ధ్య సామగ్రి అందించారు. తమ అమ్మమ్మ, తాతయ్యలను గుర్తు చేసుకుంటూ వారితో ముచ్చటించడమే కాకుండా, ప్రేమగా ఆహారాన్ని తినిపించారు.

మల్దా టౌన్-బెంగళూరు మధ్య అన్ రిజర్వుడు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా మల్దా టౌన్, ఎస్ఎంవీ బెంగళూరు మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) అన్ రిజర్వుడు ప్రత్యేక రైలు నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 03403 నంబరుతో సోమవారం (11న) సాయంత్రం 5.30 గంటలకు మల్దా టౌన్‌లో బయలుదేరిన ఈ రైలు బుధవారం తెల్లవారుజాము 1.00 గంటకు (మంగళవారం అర్ధరాత్రి దాటాక) దువ్వాడ చేరుకుని, అదే రోజు రాత్రి 7.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో 03404 నంబరు గల అన్ రిజర్వుడు ప్రత్యేక రైలు ఈ నెల 14న ఉదయం 7.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 2.28 గంటలకు దువ్వాడ, శనివారం ఉదయం 8.00 గంటలకు మల్దా టౌన్ చేరుతుందన్నారు. ఈ సర్వీసులకు 16 జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

రైలు రీ షెడ్యూలు:

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాల వల్ల ఎస్ఎంవీ బెంగళూరు-అగర్తలా హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును (12503) రీ షెడ్యూల్ చేశామని రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం (12న) ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఈ రైలు (12503) రాత్రి 8.00 గంటలకు (9 గంటల 45 నిమిషాలు ఆలస్యంగా) బయలుదేరుతుందని పేర్కొన్నారు.

అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం

జ్ఞానాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వేదికగా విశాఖ అతిమేత్రాసన అంతర పాఠశాలల క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా ఉపవిద్యాశాఖాధికారి రవీంద్రబాబు హాజరై పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో దేహ దారుఢ్యాన్ని, క్రీడాస్ఫూర్తిని, పోటీతత్వాన్ని పెంపొందింపజేస్తాయన్నారు. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇంకా ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఆంధ్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొసరాజు గోపాల కృష్ణ, ప్రత్యేక అతిథులుగా దుగ్గంపూడి బాలశౌరి, ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, ఫాదర్ సరినా ప్రతాప్‌లు పాల్గొన్నారు. విశాఖ అతిమేత్రాసన పాలనాధికారి పొలిమేర జయరాం, విశాఖ అతిమేత్రాసన పాఠశాలల డిప్యూటీ జనరల్ మేనేజర్ పొలమరశెట్టి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా తలపడ్డారు.

అనారోగ్య సిరల చికిత్సా విధానంపై అవగాహన సదస్సు

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉబికిన అనారోగ్య సిరల (వేరికోసిల్ వెయిన్స్)కు చికిత్సపై అవగాహనతోనే పురోగతి సాధించవచ్చని ఇంటర్నేషనల్ రేడియాలజిస్టు డాక్టర్ ప్రసాద్ సల్లాల తెలిపారు. సోమవారం మహారాణిపేటలో దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేడు చికిత్స పొందిన కేసులలో 90 శాతం పునరావృతం అవుతున్నాయని, కొత్త కేసుల కంటే వీటికి చికిత్స అందించటం కష్టమవుతోందని ప్రసాద్ సల్లాల అన్నారు. దీనికి లేజర్ చికిత్సా విధానం ముఖ్యమైనా ప్రత్యామ్నాయ విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ మంచి ఫలితాలనే ఇస్తుందని, ఇన్వాసిస్ చికిత్స అడ్హెసివ్ థెరపీగా చెప్పుకోవచ్చని, దీన్ని 20 నుంచి 30 నిమిషాల్లో అనస్థీషియా వైద్యుల ద్వారా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ఈ చికిత్స ద్వారా నరాలు దెబ్బతినే అవకాశం తగ్గిస్తుందన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీకి వినతి

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. సోమవారం వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సంఘం నేతలు పి.నారాయణ, గంట్ల శ్రీనుబాబు తెలిపారు.

శివాలయాల్లో కార్తీక శోభ



వన్‌టౌన్‌లోని పాత శివాలయం ధ్వజస్తంభానికి మహిళల మొక్కులు



సీతంపేట పార్వతీశ్వరాలయంలో శివుడికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట/అక్కయ్యపాలెం/జగదాంబ కూడలి/డాబాగార్డెన్స్, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని శివాలయాలకు వేకువ జాము నుంచే భక్తులు పోటెత్తారు. శివలింగాలకు జల, క్షీర, పంచామృత, నారికేళ అభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు చేయించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు సహకరించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించారు. రోజంతా ఉపవాసం ఉంటూ శివనామస్మరణతో గడిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవోలు, సిబ్బంది, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా పోలీసులు పర్యవేక్షించారు.



అక్కయ్యపాలెంలో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

సమస్యల పరిష్కారంలో ఉదాసీనత వద్దు: జడ్సీ

జ్ఞానాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) ప్రజల వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము సూచించారు. సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో 5 వినతులు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి 3, రెవెన్యూకు 2 అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యత అప్పగించారు.

పింఛన్లు ఇప్పించండి మహాప్రభో!

అక్కయ్యపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ పించన్‌దారులకు అక్టోబరు నెల పింఛన్ జమకాలేదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,239 మంది పింఛన్ సక్రమంగా అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీనెలా పింఛన్లు సకాలంలో అందజేయాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయ సంస్థలకు సెస్సు ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా సొంత నిధులు ఉన్నాయన్నారు. డీడీఓలు అక్టోబరు నెల బిల్లుల మంజూరు కోసం సీఎఫ్ఎంఎస్‌కు పంపగా సంస్థ నిధులు లభ్యత ఉన్నప్పటికీ పింఛను దారులకు ఇప్పటి వరకు జమ చేయలేదు. దీనిపై ఇప్పటికే ఈ మెయిల్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పింఛన్లను విడుదల చేసి, తమను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని మల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ జోనల్ కమిషనర్‌కు జనసేన వినతి

డాబాగార్డెన్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 34వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని జోనల్-4 కమిషనర్ నాయుడు, ఏసీపీ టౌన్‌ప్లానింగ్ ఝాన్సీ, ఎలక్ట్రికల్ ఏఈ హాస్సేన్‌లను కోరినట్లు జనసేన నాయకులు నారా నాగేశ్వరరావ, వాసుపల్లి నరేష్, నీలం రాజు సత్తిబాబు కోరారు. ఇదే విషయమై సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశామని వారు తెలియజేశారు.

కుస్తీపోటీల్లో సత్తాచాటిన విశాఖ బాలికలు



బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు

యాదమరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 కుస్తీ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా బాలికలు విజేతలుగా నిలిచి మూడు బంగారు పతకాలు సాధించారు.. వీరు డిసెంబరు రెండో తేదీనుంచి డిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ రవి తెలిపారు.

'ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు ఉద్యమిద్దాం'

సీతంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వారసత్వ సంపద అయిన ఎర్రమట్టి దిబ్బలను రూపుమాపారని, ఇప్పుడు అంతా కలిసి ఉన్న వాటిని కాపాడుకోవాలని జియాలజిస్ట్, సీనియర్ ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎర్రమట్టి దిబ్బలను కాపాడుకోగలిగితేనే యునెస్కో జియో పార్క్ దృష్టికి తీసుకువెళ్లగలమన్నారు. వాటి పరిరక్షణ బాధ్యత ప్రభుత్వమే చూడలన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌తో కలిసి మాట్లాడారు. ఎర్ర మట్టి దిబ్బలను ఎలా ధ్వంసం చేశారో ఇప్పటికే చాలాసార్లు చెప్పామని, వాటి సరిహద్దుల్లో తేడాలు ఉన్నట్లు నిపుణులు కూడా చెబుతున్నందున వాటి పరిరక్షణ కోసం పోరాడదామని మూర్తి యాదవ్ అన్నారు. హౌసింగ్ సొసైటీ వారు ఇక్కడ ఎర్రమట్టి దిబ్బలు లేవనడం నిజం కాదన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న జియాలజిస్ట్ రాజశేఖర్‌రెడ్డి, మూర్తియాదవ్

'ప్రైవేటు ఏజెన్సీలకు ఇసుక తవ్వకాలు ఇవ్వొద్దు'



కార్మికశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలు ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎం. పైడిరాజు, జీఎస్‌జే అచ్యుతరావు డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ సంయుక్త కమిషనర్ (జేసీఎల్) కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఫైల్ మీద పెడతామని చెప్పిన నేతలు నెలలు గడుస్తున్నా 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల నిధుల వినియోగంపై చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. అందరికీ ఇసుక ఉచితమేనని ప్రకటించినా ఆచరణలో అమలు కావడం లేదన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. అనంతరం కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షణాధికారి రవికుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మధరావు, ఎస్‌కే రహిమాన్, రాంబాబు, జేడీ నాయులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించండి: కందుల నాగరాజు

అల్లిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 32వ వార్డు నేరెళ్ల కోనేరు నుంచి చావుల మదుం వరకు సుమారు రూ.20 లక్షల వ్యయంతో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. .దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

ఆశీలు దందాపై విచారణ



వ్యాపారులను విచారిస్తున్న సీఐ దేముడు బాబు

జగదాంబ కూడలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్‌లో ఆశీలు దందాపై వన్‌టౌన్ సీఐ దేముడు బాబు సోమవారం విచారణ జరిపారు. చిరువ్యాపారుల నుంచి బలవంతంగా ఆశీలు వసూలుకు పాల్పడుతున్న కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ల వ్యవహారంపై ఆరా తీశారు. కాంట్రాక్టర్లతో కలిసి సిఐ స్వయంగా వ్యాపారుల వద్దకు వెళ్లి ఆశీలు ఎంత వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. పండుగల సమయాల్లో ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఆయనకు చెప్పారు. పెద్ద వ్యాపారులు, చిరు వ్యాపారులతో వేర్వేరుగా మాట్లాడారు. మహిళా వ్యాపారులు కొందరు అధిక వసూళ్ల తీరును చెప్పారు. ఇకపై ఫిర్యాదులు వస్తే అరెస్టు చేస్తానని హెచ్చరించారు.

బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తా : మళ్ల సురేంద్ర

అల్లిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గవర వర్గీయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు గవర సంక్షేమాభివృద్ధి సంస్థ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. ఈ బాధ్యతను తనకు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం అల్లిపురంలో గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విల్లూరి చక్రవర్తి, శరగడం భాస్కర్, మళ్ల వెంకటరావు పాల్గొన్నారు.



గౌరీ పరమేశ్వరుల వద్ద మళ్ల సురేంద్ర తదితరులు

ప్రతిభావంతులకు ఉపాధి అవకాశాలు

డాబాగార్డెన్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రాండ్ హయత్ జనరల్ మేనేజర్ మార్క్ స్టెర్న జియల్ ప్రసంగిస్తూ ప్రస్తుతం అతిథ్య రంగానికి విశేషమైన ఆదరణ ఉందన్నారు. వినూత్న వంటలు, స్వచ్ఛమైన ఆహారం, స్వాగత డెస్క్, హౌస్ కీపింగ్ వంటి విభాగాల్లో ఉపాధి లభిస్తుందన్నారు. సోమవారం సన్ క్యాంపస్‌లో గ్రాండ్ హయత్, ది యూనియన్ స్టేషన్ నాస్ విల్లె సంయుక్త ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ యూఎస్ఏ జే1 క్యాంపస్ డ్రైవ్' నిర్వహించారు. హెచ్ఆర్ మేనేజర్ గిడియాన్ ప్యాకినాథన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు క్యాంపస్ డ్రైవ్ దోహదపడుతుందన్నారు. సన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాన్సీ మాట్లాడుతూ సుమారు 150 మంది విద్యార్థులు యు.ఎస్.ఎ.లో ఉద్యోగాలు సాధించేందుకు ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థినీ, విద్యార్థులతో నిపుణులు

బడ్జెట్ ఆశాజనకం

... 5వ పేజీ తరువాయి

నిర్మాణానికి రూ.6 కోట్లు కేటాయించారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, రాయితీల కింద రూ.452.31 కోట్లు కేటాయించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పాత బకాయిలు వస్తాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. క్రీడలకు రూ.100 కోట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ ఆడిటోరియాలకు నూతన హంగులు సమకూరనున్నాయి. విశాఖలో ప్రాంతీయ గ్రంథాలయం అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించారు.

పోలీసు స్టేషన్లలో మౌలిక వసతులకు రూ.58 కోట్లు

నగరంలో పోలీస్ కమిషనరేట్‌కు కొత్త భవనం, మహారాణిపేట, సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్లకు కొత్త భవనాలు, ఆరిలోవలో ఏసీపీ కార్యాలయ భవనం నిర్మాణాలకు రూ.58 కోట్లు కేటాయించారు. నగరంలో కౌమార బాలుర వసతిగృహ భవనానికి రూ.42లక్షలు కేటాయించారు.

ఏయూకు రూ.389.34 కోట్లు

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపునకు బడ్జెట్‌లో రూ.389.34 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ.387.18 కోట్ల విడుదల చేయగా, ఈ ఏడాది రెండు కోట్లు పెరిగింది. వర్సిటీ అధికారులు రూ.500 కోట్లకు ప్రతిపాదించారు. వర్సిటీలో 3,500 మంది పెన్షనర్లు, 2,500 మంది ఉద్యోగులున్నారు. వీరికి ప్రతినెలా రూ.33 కోట్లు చెల్లించాలి.

అంధులకు హోమ్ ఏర్పాటు

విశాఖలో అంధుల కోసం ప్రత్యేకంగా హోమ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. బడ్జెట్‌లో ప్రత్యేకంగా దీనిని ప్రస్తావించారు. ఈ హోమ్‌లో ఉండే వారికి ఉచితంగా భోజనం, వసతి, వైద్యం, వస్త్రాలు సమకూరుస్తారు.

జీవీఎంసీకి రూ.20 కోట్లు

స్మార్ట్‌సిటీ మిషన్‌లో భాగంగా జీవీఎంసీకి రూ.20 కోట్లు కేటాయించారు. మిషన్ ఫర్ డెవలప్‌మెంట్ స్మార్ట్ సిటీస్ కింద రాష్ట్రంలో వంద నగరాలను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులకు కేటాయించింది.

ఏపీ స్టడీ సర్కిల్‌కు రూ.8 కోట్లు..

రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ, తిరుపతిలో ఏపీ స్టడీ సర్కిల్స్ ఉన్నాయి. వీటి కోసం రూ.8 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. విద్యార్థులకు ఉచితంగా శిక్షణ, మెటీరియల్ అందించేందుకు ఈ నిధులు వినియోగిస్తారు.

సూపర్ సిక్స్ పథకాలకు నిధుల్లేవు



సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల అమలుకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో వాటిని విస్మరించారు. సంక్షేమ పథకాలకు భారీగా కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ఉండాలి. విశాఖలో కీలక ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. గతంతో పోలిస్తే కొన్నిశాఖలకు మెరుగ్గా ఉన్నాయి. వ్యవసాయానికి నిధులు పెరిగాయి.

- అడ్డాల వెంకటవర్మరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

నగరం... కాలుష్య కాసారం!

... 5వ పేజీ తరువాయి

కాలుష్యకారకాలు 2020లో కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో, అదీ ప్రధానంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పీఎం 2.5 విలువ 40, పీఎం 10 విలువ 100 కంటే తక్కువగా నమోదైంది. లాక్‌డౌన్ ఎత్తివేసిన తరువాత ఈ రెండింటి విలువలు పరిధికి మించిపోయాయి. గాలిలో నాణ్యత నిర్ధారించడంలో ధూళి కణాలు కీలకంగా మారినట్టు పరిశోధనలో వెల్లడైంది. కేంద్ర కాలుష్య నియంత్రణమండలి నిర్ధారించిన ప్రమాణాల మేరకు పీఎం 10 విలువ 60, పీఎం 2.5 విలువ 40గా ఉండాలి. అయితే నగరంలో పలుమార్లు పీఎం 2.5 విలువ 202, పీఎం 10 312గా నమోదయింది. దేశవ్యాప్తంగా నమోదైన ప్రమాణాల కంటే విశాఖలో ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

కాలుష్య కారకాలివీ...

నగరంలో గాలిలో ధూళి కణాల స్థాయి, కాలుష్య తీవ్రతకు అనేక కారణాలున్నాయి. విశాఖ పోర్టు నుంచి బొగ్గు దిగుమతి, రవాణా, నగర శివారులో రెండు బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచి వచ్చే ధూళి కణాల వల్ల కాలుష్యం పెరుగుతోంది. ధూళి కణాలతోపాటు ఆర్సెనిక్, జింక్, క్రోమియం వంటి కాలుష్య కారకాలను వాతావరణంలో విడుదల చేస్తున్నాయి. తీర ప్రాంత నగరం కావడంతో సముద్రం నుంచి వచ్చే ఉప్పు ప్రభావం ఎక్కువ. పారిశ్రామిక ప్రాంతం కావడంతో నగరంలో రోజువారీ ఉత్పత్తయ్యే బయోమాస్‌ను కాల్చడం వల్ల పొటాషియంతో కూడిన ధూళి కణాలు కమ్మేస్తున్నాయి. మెటల్, పెట్రోలియం రంగాల నుంచి వచ్చే ఉద్గారాలు, ట్రాఫిక్‌తో దుమ్మధూళి కూడా గాలిలో కాలుష్యం పెరిగేందుకు కారణమవుతోంది.

భవిష్యత్తు దిక్సూచి

మెషీన్ లెర్నింగ్ విధానంతో నగరంలో భవిష్యత్తు కాలుష్య తీవ్రతను అంచనావేయవచ్చని పరిశోధనా పత్రం వెల్లడించింది. పారిశ్రామిక కార్యకలాపాలు కూడా కాలుష్యం పెరిగేందుకు కారణంగా పేర్కొంటున్నారు. నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మెరుగుపరచాలంటే స్వచ్ఛత, శుభ్రతపై దృష్టిసారించాలని రాజాంలో జీఎంఆర్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ఆచార్యుడు డాక్టరు కార్తీక్ అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రికల్, హైబ్రిడ్ వాహనాలను ప్రోత్సహించడం, శిలాజ ఇంధనంపై ఆధారపడడం తగ్గించే దిశగా నగరం ముందుకెళ్లాలని సూచించారు. గాలిలో ధూళి కణాలు విడుదలకాకుండా పరిశ్రమల్లో అధునాతన వాయు కాలుష్య నియంత్రణ పరికరాలు అమర్చే విధానాలు అమలు చేయాలన్నారు.

బీఈడీ విద్యార్థుల పరేషాన్

... 5వ పేజీ తరువాయి

అనుబంధ కాలేజీలకు చెందిన కొందరు ప్రిన్సిపాల్స్ ఉంటారు. వీరు రికార్డులను అవాల్యుయేషన్ చేసి మార్కులు ఇస్తారు. ఈ విధానంలో ప్రక్రియ పకడ్బందీగా సాగేది. అయితే గత వర్సిటీ పాలకులు ఈ విధానాన్ని మార్చేశారు. తొలుత రికార్డుల అవాల్యుయేషన్ ప్రక్రియను కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారు. ప్రస్తుతం ఈ విధానంలోనూ మార్పులు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆన్‌లైన్ సమస్యలు

ప్రతి విద్యార్థికి వర్సిటీ అధికారులు ఒక లాగిన్ ఐడీ ఇచ్చారు. ఇందులోంచి రికార్డులు రాసేందుకు అవసరమైన కొన్ని బార్‌కోడ్‌తో పేపర్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ పేపర్లలో రికార్డువర్క్‌ను పూర్తిచేసి మళ్లీ అదే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒక్కో సెమిస్టర్‌కు ఏడు నుంచి 11 రికార్డులుంటాయి. ఒక్కో రికార్డులో కనీసం 50 నుంచి 70 పేపర్లుంటాయి. వందలాది పేపర్లను ఆన్‌లైన్‌లో పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాల్సి రావడం ఇబ్బందిగా మారుతోందని పలువురు వాపోతున్నారు. ఇందుకోసం భారీగా ఖర్చు అవుతోందని చెబుతున్నారు. వర్సిటీ అధికారులు పేపర్ డౌన్‌లోడ్ చేయడానికి, రికార్డులు అప్‌లోడ్ చేయడానికి కొంత సమయం ఇస్తున్నారు. ఆలోగా ప్రక్రియ పూర్తిచేయలేకపోతే రూ.2 వేలు వరకు జరిమానా చెల్లించాల్సి వస్తోంది. కొన్ని సార్లు కళాశాలల యాజమాన్యాలు, వర్సిటీ నుంచి సమాచారం రావడం ఆలస్యమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విధానాన్ని మార్చి గతంలో మాదిరిగా రికార్డులు రాసి కళాశాలల్లోనే అప్పగించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు. అంతేకాకుండా గతంలో వర్సిటీ మోడరేషన్ బోర్డు ఆధ్వర్యంలో అవాల్యుయేషన్ ప్రక్రియను నిర్వహించడం వల్ల పారదర్శకత ఉండేదని, ప్రస్తుతం బయటివారికి అప్పగించడం వల్ల సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలోని ఎక్కడా లేని విధంగా ఏయూలో మాత్రమే ఈ విధానం అమలు చేస్తుండడంపై మండిపడుతున్నారు.

ఆర్థిక భారం

విశ్వవిద్యాలయం పరిధిలో 53 బీఈడీ కాలేజీల్లో సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరు ఒక్కో సెమిస్టర్‌కు ఏడు నుంచి 11 రికార్డులు సమర్పించాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు కనీసం రూ.3 వేలు వరకు ఖర్చవుతోంది. జాప్యం జరిగి ఫైన్ చెల్లించాల్సి వస్తే మరింత భారం పడుతుంది. కొన్నిసార్లు సర్వర్ సమస్యతో డౌన్‌లోడ్, అప్‌లోడ్ కాకపోవడం వంటి ఇబ్బందులు ఎదురైతే మరింతగా జేబుకు చిల్లు పడుతోందని వాపోతున్నారు.

35 శాతమే జీతం

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తి జరుగుతుంది. ఇక్కడ ఉద్యోగుల్లో 70 శాతం మంది ప్రతిరోజూ 150 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన వాతావరణంలో పనిచేస్తారు. అంత కష్టపడినా వారి శ్రమను యాజమాన్యం గుర్తించడం లేదు. పూర్తిస్థాయి జీతం చెల్లించడం లేదు. పైగా కోతలు పెంచుకుంటూ పోతోంది.

35 శాతం జీతంతో బతకడమెలా?

స్టీల్‌ప్లాంటులో పనిచేసే ఉద్యోగికి సగటున కోతలు పోను రూ.40వేల జీతం వస్తుంది. అందులో సగమే చెల్లిస్తుండడం తో దానిని అలవాటు చేసుకున్నారు. అంటే రూ.20వేలు. తాజాగా 35 శాతమే ఇచ్చారు. అంటే రూ.13,500 వరకు వస్తుంది. ఈ మొత్తంతో భార్య, ఇద్దరు పిల్లలతో ఎలా జీవించాలని ఉద్యోగులు వాపోతున్నారు. యాజమాన్యం కావాలనే ఇలా చేస్తున్నదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. జీతాలు ఇవ్వని సంస్థలో పనిచేయడం మానేసి, స్వచ్ఛందంగా ఉపాధి వెదుక్కునేలా చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఉద్యోగుల సంఖ్య తగ్గించుకొని, ఆ తరువాత ప్రైవేటుకు ప్లాంటును అప్పగించాలని యోచిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

నిధులున్నా ఇవ్వడం లేదు

యాజమాన్యం వద్ద నిధులు లేని సమయంలో జీతాలు ఇవ్వకపోయినా ఆందోళన చెందలేదు. ఇప్పుడు బ్యాంకుల్లో మొత్తం రూ.950 కోట్ల నిధులున్నాయి. వాటిలో పది శాతం కంటే తక్కువ ఉద్యోగులకు జీతాలు ఇవ్వొచ్చు. సెప్టెంబరు బకాయి 50 శాతం ఇవ్వకుండా అక్టోబరు జీతాలు ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదు. ఎవరితో చర్చించి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారో వెల్లడించాలి. ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుంది. తక్షణమే జీతాల బకాయిలన్నీ చెల్లించాలి.

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

శ్రీవిశ్వ జూనియర్ కళాశాలకు షోకాజ్

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా పిల్లలకు బిర్యానీ, రొయ్యలు, గుడ్లు, చేపలతో భోజనం వడ్డించారు. అక్కడ మిగిలిన ఆహారాన్ని లాసన్స్‌బేకాలనీలో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల బాలికల హాస్టల్‌కు తరలించారు. రాత్రి అదే ఆహారాన్ని అందించారు. ఉదయం వండిన ఆహారం కావడంతో ఫుడ్ పాయిజనింగ్ జరిగి ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు. ఇంటర్‌బోర్డు ఆర్ఐవో మురళీధర్ ఇతర అధికారులు ఆస్పత్రికి వచ్చి పరిశీలించారు. కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం బాలికల ఆరోగ్యం కుదుటుపడడంతో జనరల్ వార్డుకు తరలించారు. కలెక్టర్ ఆదేశాలతో సోమవారం మధ్యాహ్నం హాస్టల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు జగన్నాథరావు నేతృత్వంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కాగా లాసన్స్‌బేకాలనీలో హాస్టల్ నిర్వహణకు అనుమతిలేదని ఇంటర్‌బోర్డు అధికారుల తనిఖీలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యానికి షోకాజ్ జారీచేశారు. తదుపరి చర్యలకు ఇంటర్‌బోర్డు అధికారులు నిర్ణయించారు.



వినతులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

జీవీఎంసీకి 106 వినతులు

వెంకోజీపాలెం,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నగర వ్యాప్తంగా 106 వినతులు వచ్చాయి. మేయర్ హరి వెంకటకుమారి, కమిషనర్ సంపత్ కుమార్ వినతులు స్వీకరించారు. మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

14 వరకు కంటి వ్యాధులపై బాలలకు అవగాహన

ఆరిలోవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో ఈనెల 14 వరకు కంటి వ్యాధులపై బాలలకు అవగాహన కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్లాలు పిల్లల దృష్టిపై ప్రభావం చూపనున్నందున చైతన్య పరుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం

మద్దిలపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నేపథ్యంలో దేశ భవిష్యత్ రూపొందించడంలో ఆయన సేవలు ఎనలేనివని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు సి.వి.ఎస్.రవీంద్రనాథ్, జి.వి.ప్రతాప్, పోల ఉమామహేశ్వరరావు, డి.శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తప్పిదాలను సరిదిద్దే బడ్జెట్ : వజ్జ

మద్దిలపాలెం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దేలా కూటమి ప్రభుత్వం రూ.2.94 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టి రాష్ట్ర పునర్నిర్మాణానికి నాంది పలికిందని ఏపీ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిచ్చి పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి, జలవనరులకు ఎక్కువ కేటాయింపులిచ్చి మంచి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత సీఎం చంద్రబాబు,ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కి దక్కిందన్నారు. ఇంధన రంగం, రోడ్లు-భవనాలు, ఉన్నత విద్యకు ప్రాధాన్యత కల్పించారని, బీసీ, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి, పోలీస్ శాఖకు ఎక్కువ నిధులు కేటాయించారని తెలిపారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో :** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 28, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 34, క్యారెట్ 52 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది)60, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230





కొత్త వెంకోజీపాలెం శివాలయంలో పూజలో పాల్గొన్న భక్తులు, శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



హెచ్‌బీ కాలనీ ఆలయం రావి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అంతటా శివనామస్మరణ

- మార్మోగిన ఆలయాలు
- వేకువజాము నుంచి పోటెత్తిన భక్తులు
- ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యుల ఏర్పాట్లు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం రెండో సోమవారం 'హరహర మహాదేవ శంభో శంకర' అంటూ ఆలయాలు మారుమోగాయి.శివ దర్శనానికి భక్తులు బారులు తీరారు.తెల్లవారుజాము 3. గంటల నుంచే అభిషేకాలు జరిపారు. కొత్తవెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞాన లింగేశ్వరాలయంలో విశేష సంఖ్యలో హాజరైన భక్తులకు ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్ శర్మ ఆధ్వర్యంలో ఇతర అర్చకులు భక్తుల గోత్రనామాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.సామూహిక రుద్రాభిషేకాలు జరిపారు. పెద్దసంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా శివ దర్శనానికి విచ్చేశారు. ప్రశాంతంగా దర్శనం చేసుకునేందుకు వీలుగా నిర్వాహకులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలు ఆకాశ దీపాలు వెలిగించారు. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, జేఈ రాంబాబు, ఇతర సిబ్బంది పర్యవేక్షించారు.. వీరికి స్థానిక గ్రామసేవాసంఘం అధ్యక్షుడు పీల కనకరాజు, కార్యవర్గ సభ్యులు సహకరించారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజలు జరిపారు. అర్చకులు వెంకటాచార్యులు సాయంత్రం ఆలయ ప్రాంగణంలోనున్న ధ్వజ స్తంభం వద్ద ఆకాశజ్యోతులు వెలిగించారు. హెచ్‌బీకాలనీ, ఇసుకతోట, కేఆర్‌ఎంకాలనీలోని ఆలయాల్లోనూ అభిషేకాలు, అర్చనలు, పూజలు, దర్శనాలు కొనసాగాయి.

ఆరిలోవ : ఆరిలోవలోని శివాలయాలు కిటకిటలాడాయి. బాల త్రిపుర సుందరీ సహిత మల్లేశ్వర స్వామి ఆలయంలో భక్తులు వేకువ నుంచి క్యూలో నిలబడి దర్శనానికి బారులు తీరారు. జీవ నదుల నుంచి తీసుకువచ్చిన జలాలు, పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలు, విభూతి, నారికేళ జలాలతో స్వామిని అభిషేకించారు. ఆలయ చీఫ్ ట్రస్టీ కృష్ణంరాజు భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. పెదగదిలిలో కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరాలయం, ఆరిలోవలోని ద్వాదశ లింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు, చినగదిలి, పెదగదిలిలోని వివిధ ఆలయాల్లో సాయంత్రం ఆకాశ దీపాన్ని వెలిగించారు.

పెదవాల్తేరు : పెదవాల్తేరులోని శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో కార్తీక పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు బారులు తీరారు. శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సిహెచ్ జ్యోతి, అర్చకులు కాశీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రామ్‌నగర్‌లో శివ లింగానికి పాలాభిషేకం

రామ్‌నగర్ : దసపల్లా హిల్స్ ఉత్కల్ సాంస్కృతిక మండలి జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో కార్తీక పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున విచ్చేసి స్వామి వారికి అభిషేకాలు చేశారు,

నేటి నుంచి పాండురంగని కల్యాణం

బీచ్ రోడ్డులోని పాండురంగస్వామి ఆలయంలో శ్రీరుక్మిణీ సమేత ప్రసన్న పాండురంగ స్వామికి కల్యాణం, వార్షికోత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజర్ అడపా దేవుళ్ళు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

డంపింగ్ యార్డులుగా స్టీల్‌ప్లాంట్ స్థలాలు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రూ. కోట్లు విలువ చేసే స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. భవన నిర్మాణ వ్యర్థాలు, గోవుల పెంపకం, చెత్తా చెదారాలతో ఇవి నిండిపోతున్నాయి. 15, 16 వార్డుల్లోని హెచ్‌బీకాలనీ స్టీల్‌ప్లాంట్ స్థలాల దుస్థితి ఇది. రెండు దశాబ్దాల కిందట ఈ ప్రాంతం జనావాసాలతో సందడిగా ఉండేది. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇక్కడున్న ఉద్యోగులను పదవీ విరమణ వరకు క్వార్టర్‌లో ఉంచేవారు. ఆ తరువాత ఎవరికీ క్వార్టర్స్ మంజూరు చేయలేదు. ఇటీవల స్థలాలన్నీ ఆన్‌లైన్‌లో వేలంపాట నిర్వహించాలని నిర్ణయించుకుని అక్కడక్కడ ఉన్న ఉద్యోగులను సైతం క్వార్టర్స్ నుంచి ఖాళీ చేయించారు. అలా ఖాళీ అయిన క్వార్టర్స్ పడగొట్టేసి ఖాళీ స్థలాలుగా మార్చి విక్రయించేందుకు లేఅవుట్‌ల కింద రూపొందించి, క్రమసంఖ్య ఇచ్చారు. అనుకున్నట్లే ఆన్‌లైన్‌లో వేలంపాట నిర్వహించారు. దీనిలో ఒకటి రెండు స్థలాలను బిడ్డర్‌లు దక్కించుకున్నారు. మిగిలినవి మాత్రం కొన్ని కారణాల వల్ల అలానే ఉండిపోయాయి. ఇప్పుడవి చుట్టుపక్కల నిర్మాణాలు సాగిస్తున్న వారు మిగిలిన వ్యర్థాలు వేయటానికి, చెత్తాచెదారం పారేయడానికి, గోవుల పెంపకానికి వినియోగిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు దీనిపై శ్రద్ధ చూపి స్థలాలు పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.



భవన వ్యర్థాలతో నిండిపోతున్న స్థలాలు

శ్రీవిశ్వ జూనియర్ కళాశాలపై చర్యలకు డిమాండ్

మద్దిలపాలెం,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విషాహారానికి కారణమైన శ్రీవిశ్వ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐడీఎస్‌వో నగర ఉపాధ్యక్షుడు బి.సంతోష్ డిమాండ్ చేశారు.విషాహారం సేవనం కారణంగా ఓమ్ని ఆర్కె. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను సోమవారం ఏఐడీఎస్‌వో నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని చాలా కళాశాలల వసతి గృహాల్లో విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేవన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం కూడా అందించడం లేదన్నారు. లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేసి విద్యార్థుల ఆరోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారని మండిపడ్డారు. విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులతో స్వతంత్ర కమిటీలు వేసి వసతి గృహాలు పర్యవేక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



బాలికలను పరామర్శిస్తున్న నాయకులు

న్యాయ కళాశాల విద్యార్థులకు పునశ్చరణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతామాణిక్యం

వెంకోజీపాలెం,నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఏయూ లాకళాశాలలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు పునశ్చరణ, నూతన విద్యా సంవత్సరాన్ని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎస్ఎన్ఎల్‌యూ మాజీ వీసీ ప్రొఫెసర్ వి. కేశవరావు, గీతం స్కూల్ ఆఫ్ లా మాజీ డీన్ డాక్టర్ ఆర్. అనితరావ్, ఎ-హబ్ సీఈవో ఈసారపు రవి పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు సారె సమర్పణ



అమ్మవారికి సారె తీసుకువెళుతున్న భక్తులు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గవర జాతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే గౌరీ పరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా పాత వెంకోజీపాలెం శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సారెను సమర్పించారు. వివిధ రకాల మిఠాయిలు, పొంగడాలు, బూరెలు, అరిసెలు, పసుపు, కుంకుమలను గౌరీ పరమేశ్వరులకు తీసుకువచ్చారు. ఇసుకతోట నుంచి బాజాభజంత్రీలతో ఊరేగింపుగా మహిళలు, గ్రామ పెద్దలు సారెను తెచ్చి గౌరీపరమేశ్వరులకు సమర్పించారు. ఆలయ అర్చకులు రంపా మురళి అభిషేకం నిర్వహించి, తీర్థ ప్రసాదాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామ సేవా సంఘం అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, మళ్ల రవికుమార్, కార్యవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఇసుకతోట గ్రామస్థులను సత్కరించారు. సీతారామ సేవా మండలి అధ్యక్షులు సూరిశెట్టి వెంకటేశ్వరన్, మాజీ అధ్యక్షులు పెంటకోట చిన్నాబాబు, సహాయకార్యదర్శి పెంటకోట రమేష్, ఆడిటర్ సూరిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గీతంలో బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రారంభం

సాగర్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ వేదికగా జవహర్ నవోదయ విద్యాలయ సమితి (జేఎన్‌వీ) ఆధ్వర్యంలో ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సోమవారం నుంచి ప్రారంభమైంది. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి నవోదయ విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గీతం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు మాట్లాడుతూ విజ్ఞానానికి పరిధి లేదని,సైన్స్ సహా అన్ని శాస్త్రాలు మనిషి ఎదగడానికి ముఖ్యమని చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్, శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కె.ఎస్. కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగంలో ఎదగానికి అవకాశం కల్పిస్తే దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా, నిపుణులుగా ఎదుగుతారని తెలిపారు. నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ ఇ. ఉమాపతిరెడ్డి మాట్లాడుతూ దేశంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి నవోదయ విద్యాలయాలు కృషిచేస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులు చిత్రాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, నవోదయ విద్యాలయం సమితి విశాఖ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వాణిశ్రీ, హాజరైన ఉపాధ్యాయులు

పుస్తకాలు లేకుండా బోధనపై అవగాహన

మద్దిలపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్దిలపాలెం కృష్ణ కళాశాల రోడ్డులోని స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్‌లో నిర్వహించిన స్టడీ హబ్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పుస్తకాలు లేకుండా విద్యార్థులకు బోధించే అత్యాధునిక పద్ధతులపై అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన ప్రైవేటు పాఠశాలల అధినేతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పలు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రీ కేజీ నుంచి 7వ తరగతి విద్యార్థుల వరకు అందరితో మాట్లాడి వారి విజ్ఞానానికి ముగ్ధులయ్యారు. ప్రాథమిక అంశాలు, భావవ్యక్తీకరణలో ప్రావీణ్యం పొందిన ప్రీ కేజీ పిల్లలు 500 ప్రశ్నలకు సమాధానాలు చెప్పి ఆశ్చర్యానికి గురిచేశారు. యూకేజీ విద్యార్థులు ప్రపంచ పటంలోని దేశ రాజధానులను గుర్తించడమే కాకుండా గణితం, ఆంగ్లంలో ప్రావీణ్యం చూపించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరక్టర్ మళ్ల రామునాయుడు, ప్రిన్సిపాల్ వాణిశ్రీ, మళ్ల శర్వాణి పుస్తకాలు లేకుండా విద్యార్థులకు ఎలా బోధించాలో శిక్షణ తరగతులు నిర్వహించారు.తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు ఎస్.మధుసూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు కృషి

రామ్‌నగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సృజనాత్మకత, విజ్ఞానం మానసిక ఉల్లాసం పెంపొందించటానికి సందేశాత్మక చిత్రాలు దోహదపడతాయని రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 9 చైర్మన్ ముక్సూద్ అహ్మద్ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా సోమవారం రాంనగర్‌లో జీవీఎంసీ పాఠశాల విద్యార్థులను మధురవాడలో సినిమా థియేటర్‌కు తీసుకెళ్లి ఉచితంగా వినోదాత్మక సైన్స్ ఫిక్షన్ సినిమా ప్రదర్శించారు. సినిమా చూసిన విద్యార్థులకు మానసిక ఉల్లాసం వెల్లివిరిసిందన్నారు. విద్య ద్వారా స్వేచ్ఛ అనే నినాదంతో విద్యార్థులు సౌకర్యవంతమైన విద్యను అభ్యసించేందుకు రౌండ్ టేబుల్ సంస్థ సహకరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య దేవ్ సింగ్ ,నీలేష్ జైన్, యలమర్తి దినేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేత సెయింట్ ఫ్రాన్స్ టీమ్

ఆరిలోవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ వ్యాలీ స్కూలులో నిర్వహించిన అండర్ -12 ఫుట్‌బాల్ టోర్నమెంట్లో విన్నర్స్‌గా సెయింట్ ఫ్రాన్స్ స్కూలు నిలిచింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఏపీ రూట్ చైర్‌పర్సన్ సుస్మిత, ఎస్‌డీవో జూన్ గాలేట్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కోచ్ శేషమోహన్, వైస్ ప్రెసిడెంట్ రాజారావు, జోన్ ఇన్‌చార్జి రామకృష్ణ, సన్ని, బాబు పాల్గొన్నారు.

స్తంభాలపై తొలగించిన తీగెలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ స్తంభాలపై అల్లుకున్న పొదలను ఆ శాఖ సిబ్బంది తొలగించారు. అల్లుకున్న నిర్లక్ష్యం అన్న శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఆ శాఖాధికారులు స్పందించారు. స్తంభాలపై ఉన్న తీగెల పొదులను పూర్తిగా తొలగించారు. అయితే ప్రస్తుతం సదరు విద్యుత్తు స్తంభాలపై సరఫరాను అండర్ గ్రౌండ్ సరఫరాకు మార్చామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం స్తంభాలపై సరఫరా లేదని, అయినా తీగెలను పూర్తిగా తొలగించామని చెప్పారు.



స్తంభాలపై తొలగించిన తీగెలు

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రజాప్రతినిధులకు శిక్షణ నేడు

పద్మనాభం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై ప్రజాప్రతినిధులకు మంగళవారం శిక్షణ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయకుమార్ తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆచార్యులు

ఆదర్శప్రాయుడు బ్రౌన్

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం బ్రౌన్ చిరస్మరణీయుడని ఏయూ తెలుగుశాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అన్నారు. ఏయూ తెలుగు విభాగంలో సోమవారం సీపీ బ్రౌన్ 226వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాళపత్ర గ్రంథాల సేకరణ, సంస్కరణ, ముద్రణ, వ్యాకరణ రచన, నిఘంటు నిర్మాణం, రచనలు, వ్యాసాలు రాయడంలో బ్రౌన్ తెలుగువారికి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, పి.కన్నయ్య డాక్టర్ ఈశ్వరమ్మ, డాక్టర్ లావణ్య, జి.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతను ఉన్నతంగా మలచడమే నూతన విద్యా విధానం లక్ష్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యువతను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మలచడమే నూతన విద్యా విధానం లక్ష్యమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఏయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల జాతీయ సదస్సు "ఈక్విటీ డైవర్సిటీ అండ్ ఇంక్లూషన్ ఇన్ ఎన్ ఈ పీ 2020 ఇష్యూస్, కన్సర్న్స్ అండ్ చాలెంజర్స్"ను ఆయన సోమవారం ప్రారంభించారు. జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ విద్యార్థి కేంద్రంగా నూతన విద్యా విధానం రూపొందించారని, ఎక్కువ శాతం యువత ఉన్నత విద్యలో ప్రవేశించడం దీని లక్ష్యమని చెప్పారు. బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలికించి, విద్యార్థులు స్వయంగా నేర్చుకునే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. ఆరో తరగతి నుంచి వృత్తి విద్య భాగమవుతుందన్నారు. పాఠశాల విద్యలో మార్పులను వివరించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, మను కేంద్రీయ వర్సిటీ శాటిలైట్ క్యాంపస్ (బీహార్) విద్యా విభాగం ఆచార్యులు పి.ఎం పాల్ పాటేటి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను విడుదల చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 33 కేవీ డెయిరీ ఫారం, సీఎంఆర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సింహాచలం నాయుడు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈడెన్ గార్డెన్ (నార్త్ స్టార్ అపార్టుమెంటు), సీఎంఆర్ ఫంక్షన్ హాల్, లాన్సమ్ ఇసుకతోట జంక్షన్ ప్రాంతం, పాత వెంకోజీపాలెం, జేఆర్ నగర్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేత్ర సమస్యలపై అప్రమత్తం



విద్యార్థులకు నేత్ర సమస్యలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ తొమ్మిదో సెక్టరు అప్పుఘర్ వద్ద నున్న హెలెన్ కెల్లర్ అంధుల పాఠశాలలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ ముఖ్య అతిథిగా, మరో ఆరుగురు న్యాయమూర్తులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. నేత్ర వైద్య నిపుణులు తేజ ప్రవీణ్ బృందం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించింది. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. పాఠశాల కరస్పాండెంట్ ఇ.లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న టచ్ స్టోన్ ఛారిటీస్ హరేకృష్ణ మూవ్‌మెంట్ సభ్యులు

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంవీపీ కేంద్రంగా వివిధ సేవలందిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్, అనుబంధ సంస్థ అయిన టచ్ స్టోన్ చారిటీస్ సభ్యులు సోమవారం పరిశీలించారు. విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న 600 మంది పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వితరణ కార్యక్రమానికి నిధులు అందించింది. పెదవాల్తేరులోని శాంతి ఆశ్రమం,రామ్‌నగర్‌లోని విశాఖ సేవా సదన్ స్కూల్, ఏవీఎన్ స్కూల్‌లోని విద్యార్థులకు ఈఏడాది జులై 15 నుంచి మధ్యాహ్న భోజనాన్ని హరే కృష్ణ మూవ్‌మెంట్ అందిస్తోంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో టచ్ స్టోన్ చారిటీస్ అధ్యక్షులు డాక్టర్ నిష్క్రించిన భక్త దాస మాట్లాడారు. గడచిన పన్నెండేళ్లుగా కేజీహెచ్ ఆసుపత్రి వద్ద రోగి సహాయకులకు, 11 నెలలుగా టాటా మెమోరియల్ ఆధ్వర్యంలోని బాబా క్యాన్సర్ ఆసుపత్రి వద్ద మూడు పూటలా టచ్ స్టోన్ చారిటీస్ భోజనం సమకూరుస్తోందని భక్తదాస చెప్పారు.

వృద్ధులకు విద్యార్థుల సేవలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మానవ సేవే, మాధవ సేవ అన్న సత్యసాయిబాబా దివ్య సందేశాన్ని అమలు చేయడంలో భాగంగా సత్యసాయి విద్యా విహార్ విద్యార్థులు వృద్ధాశ్రమాలు, దేవాలయాల్లో సోమవారం పలు సేవలందించారు. సత్యసాయి 99వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీలోని అమ్మ ఓల్డ్ ఏజ్ హోం, శివాలయంలో వృద్ధులకు పదో తరగతి విద్యార్థులు నిత్యావసర సరకులు, పారిశుధ్య సామగ్రి అందించారు. తమ అమ్మమ్మ, తాతయ్యలను గుర్తు చేసుకుంటూ వారితో ముచ్చటించడమే కాకుండా, ప్రేమగా ఆహారాన్ని తినిపించారు.

మల్దా టౌన్-బెంగళూరు మధ్య అన్ రిజర్వుడు ప్రత్యేక రైలు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా మల్దా టౌన్, ఎస్ఎంవీ బెంగళూరు మధ్య ఒక ట్రిప్పు (రానుపోను) అన్ రిజర్వుడు ప్రత్యేక రైలు నడుపుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 03403 నంబరుతో సోమవారం (11న) సాయంత్రం 5.30 గంటలకు మల్దా టౌన్‌లో బయలుదేరిన ఈ రైలు బుధవారం తెల్లవారుజాము 1.00 గంటకు (మంగళవారం అర్ధరాత్రి దాటాక) దువ్వాడ చేరుకుని, అదే రోజు రాత్రి 7.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు చేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో 03404 నంబరు గల అన్ రిజర్వుడు ప్రత్యేక రైలు ఈ నెల 14న ఉదయం 7.00 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజాము 2.28 గంటలకు దువ్వాడ, శనివారం ఉదయం 8.00 గంటలకు మల్దా టౌన్ చేరుతుందన్నారు. ఈ సర్వీసులకు 16 జనరల్ సెకెండ్ క్లాసు, రెండు సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

రైలు రీ షెడ్యూలు:

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ కారణాల వల్ల ఎస్ఎంవీ బెంగళూరు-అగర్తలా హంసఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును (12503) రీ షెడ్యూల్ చేశామని రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం (12న) ఉదయం 10.15 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరులో బయలుదేరాల్సిన ఈ రైలు (12503) రాత్రి 8.00 గంటలకు (9 గంటల 45 నిమిషాలు ఆలస్యంగా) బయలుదేరుతుందని పేర్కొన్నారు.

అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం

జ్ఞానాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురంలోని జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వేదికగా విశాఖ అతిమేత్రాసన అంతర పాఠశాలల క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. జిల్లా ఉపవిద్యాశాఖాధికారి రవీంద్రబాబు హజరై పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో దేహ దారుఢ్యాన్ని, క్రీడాస్ఫూర్తిని, పోటీతత్వాన్ని పెంపొందింపజేస్తాయన్నారు. ఈ పోటీల్లో భాగంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఇంకా ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా ఆంధ్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొనరాజు గోపాల కృష్ణ, ప్రత్యేక అతిథులుగా దుగ్గంపూడి బాలశౌరి, ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, ఫాదర్ సరినా ప్రతాప్‌లు పాల్గొన్నారు. విశాఖ అతిమేత్రాసన పాలనాధికారి పొలిమేర జయరాం, విశాఖ అతిమేత్రాసన పాఠశాలల డిప్యూటీ జనరల్ మేనేజర్ పొలమరశెట్టి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా తలపడ్డారు.

అనారోగ్య సిరల చికిత్సా విధానంపై అవగాహన సదస్సు

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉబికిన అనారోగ్య సిరల (వేరికోసిల్ వెయిన్స్)కు చికిత్సపై అవగాహనతోనే పురోగతి సాధించవచ్చని ఇంటర్నేషనల్ రేడియాలజిస్టు డాక్టర్ ప్రసాద్ సల్లాల తెలిపారు. సోమవారం మహారాణిపేటలో దీనిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేడు చికిత్స పొందిన కేసులలో 90 శాతం పునరావృతం అవుతున్నాయని, కొత్త కేసుల కంటే వీటికి చికిత్స అందించటం కష్టమవుతోందని ప్రసాద్ సల్లాల అన్నారు. దీనికి లేజర్ చికిత్సా విధానం ముఖ్యమైనా ప్రత్యామ్నాయ విధానాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ మంచి ఫలితాలనే ఇస్తుందని, ఇన్వాసిస్ చికిత్స అడ్హెసెవ్ థెరపీగా చెప్పుకోవచ్చని, దీన్ని 20 నుంచి 30 నిమిషాల్లో అనస్థీషియా వైద్యుల ద్వారా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. ఈ చికిత్స ద్వారా నరాలు దెబ్బతినే అవకాశం తగ్గిస్తుందన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయితీకి వినతి

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్‌ను ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ కార్యవర్గం విజ్ఞప్తి చేసింది. సోమవారం వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని సంఘం నేతలు పి.నారాయణ, గంట్ల శ్రీనుబాబు తెలిపారు.

15న సింహాచలంలో నదీ హారతి

సింహాచలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15న కార్తీక పౌర్ణమినాడు కొండదిగువ వరాహ పుష్కరిణిలో నదీ హారతి నిర్వహించనున్నట్టు సింహాచలం దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు తెలిపారు ఉత్సవంలో భాగంగా ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు దేవస్థానం ఉపాలయం వేంకటేశ్వరస్వామి సన్నిధి నుంచి పల్లకిలో ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకువస్తారు. ప్రత్యేక వేదికపై స్వామివారిని దేవేరులతో ఉంచి షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఏక హారతి, ద్వయ హారతి, అష్ట హారతి, కుంభ హారతి, నక్షత్ర హారతులను పుష్కరిణికి ఇచ్చి, ప్రత్యేక నివేదనలు సమర్పించనున్నారు. భక్తులు ఒడ్డున దీపాలు వెలిగించనున్నారు.

సాగర దుర్గమ్మ ఆలయ ప్రారంభం

పద్మనాభం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది గ్రామంలో సాగర దుర్గ అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. వేడుకల్లో భాగంగా తొలిరోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, పరిషత్తు ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాసన చేశారు. ఉత్సవ మూర్తులను ఊరేగించారు.

శివాలయాల్లో కార్తీక శోభ



వన్‌టౌన్‌లోని పాత శివాలయం ధ్వజస్తంభానికి మహిళల మొక్కులు



సీతంపేట పార్వతీశ్వరాలయంలో శివుడికి పాలాభిషేకం చేస్తున్న అర్చకులు

సీతంపేట/అక్కయ్యపాలెం/జగదాంబ కూడలి/డాబాగార్డెన్స్, నవంబరు 11: (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని శివాలయాలకు వేకువ జాము నుంచే భక్తులు పోటెత్తారు. శివలింగాలకు జల, క్షీర, పంచామృత, నారికేళ అభిషేకాలు, సామూహిక రుద్రాభిషేకాలు చేయించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు సహకరించారు. భక్తుల శివనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపారాధన చేశారు. సాయంత్రం ఆకాశ దీపాలు వెలిగించారు. రోజంతా ఉపవాసం ఉంటూ శివనామస్మరణతో గడిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవోలు, సిబ్బంది, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా పోలీసులు పర్యవేక్షించారు.



అక్కయ్యపాలెంలో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

సమస్యల పరిష్కారంలో ఉదాసీనత వద్దు: జడ్సీ

జ్ఞానాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) ప్రజల వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము సూచించారు. సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో 5 వినతులు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి 3, రెవెన్యూకు 2 అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కార బాధ్యత అప్పగించారు.

పింఛన్లు ఇప్పించండి మహాప్రభో!

అక్కయ్యపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా గ్రంథాలయ సంస్థ పింఛన్‌దారులకు అక్టోబరు నెల పించన్ జమకాలేదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,239 మంది పింఛన్ సక్రమంగా అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రతీనెలా పింఛన్లు సకాలంలో అందజేయాలని పలుమార్లు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయ సంస్థలకు సెస్సు ప్రభుత్వ గ్రాంట్ల ద్వారా సొంత నిధులు ఉన్నాయన్నారు. డీడీఓలు అక్టోబరు నెల బిల్లుల మంజూరు కోసం సీఎఫ్ఎంఎస్‌కు పంపగా సంస్థ నిధులు లభ్యత ఉన్నప్పటికీ పింఛను దారులకు ఇప్పటి వరకు జమ చేయలేదు. దీనిపై ఇప్పటికే ఈ మెయిల్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పింఛన్లను విడుదల చేసి, తమను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని మల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ జోనల్ కమిషనర్‌కు జనసేన వినతి

డాబాగార్డెన్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి 34వ వార్డులోని సమస్యలను పరిష్కరించాలని జోనల్-4 కమిషనర్ నాయుడు, ఏసీపీ టౌన్‌ప్లానింగ్ ఝూన్సీ, ఎలక్ట్రికల్ ఏఈ హస్సేన్‌లను కోరినట్లు జనసేన నాయకులు నారా నాగేశ్వరరావు, వాసుపల్లి నరేష్, నీలం రాజు సత్తిబాబు కోరారు. ఇదే విషయమై సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశామని వారు తెలియజేశారు.

కుస్తీపోటీల్లో సత్తాచాటిన విశాఖ బాలికలు



బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారులు

యాదమరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-17 కుస్తీ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా బాలికలు విజేతలుగా నిలిచి మూడు బంగారు పతకాలు సాధించారు.. వీరు డిసెంబరు రెండో తేదీనుంచి డిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పీడీ రవి తెలిపారు.

'ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు ఉద్యమిద్దాం'

సీతంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వారసత్వ సంపద అయిన ఎర్రమట్టి దిబ్బలను రూపుమాపారని, ఇప్పుడు అంతా కలిసి ఉన్న వాటిని కాపాడుకోవాలని జియాలజిస్ట్, సీనియర్ ప్రొఫెసర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఎర్రమట్టి దిబ్బలను కాపాడుకోగలిగితేనే యునెస్కో జియో పార్క్ దృష్టికి తీసుకువెళ్లగలమన్నారు. వాటి పరిరక్షణ బాధ్యత ప్రభుత్వమే చూడలన్నారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌తో కలిసి మాట్లాడారు. ఎర్ర మట్టి దిబ్బలను ఎలా ధ్వంసం చేశారో ఇప్పటికే చాలాసార్లు చెప్పామని, వాటి సరిహద్దుల్లో తేడాలు ఉన్నట్లు నిపుణులు కూడా చెబుతున్నందున వాటి పరిరక్షణ కోసం పోరాడదామని మూర్తి యాదవ్ అన్నారు. హౌసింగ్ సొసైటీ వారు ఇక్కడ ఎర్రమట్టి దిబ్బలు లేవనడం నిజం కాదన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న జియాలజిస్ట్ రాజశేఖర్‌రెడ్డి, మూర్తియాదవ్

'ప్రైవేటు ఏజెన్సీలకు ఇసుక తవ్వకాలు ఇవ్వొద్దు'

అక్కయ్యపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలు ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వొద్దని సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎం. పైడిరాజు, జీఎస్‌జే అచ్యుతరావు డిమాండ్ చేశారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మికశాఖ సంయుక్త కమిషనర్ (జేసీఎల్) కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఫైల్ మీద పెడతామని చెప్పిన నేతలు నెలలు గడుస్తున్నా 50 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల నిధుల వినియోగంపై చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. అందరికీ ఇసుక ఉచితమేనని ప్రకటించినా ఆచరణలో అమలు కావడం లేదన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. అనంతరం కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం పర్యవేక్షణాధికారి రవికుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎం.మన్మధరావు, ఎస్కే రహిమాన్, రాంబాబు, జేడీ నాయులు పాల్గొన్నారు.



కార్మికశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆశీలు దందాపై విచారణ



వ్యాపారులను విచారిస్తున్న సీఐ దేముడు బాబు

జగదాంబ కూడలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్‌లో ఆశీలు దందాపై వన్‌టౌన్ సీఐ దేముడు బాబు సోమవారం విచారణ జరిపారు. చిరువ్యాపారుల నుంచి బలవంతంగా ఆశీలు వసూలుకు పాల్పడుతున్న కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ల వ్యవహారంపై ఆరా తీశారు. కాంట్రాక్టర్లతో కలిసి సిఐ స్వయంగా వ్యాపారుల వద్దకు వెళ్లి ఆశీలు ఎంత వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. పండుగల సమయాల్లో ఎక్కువ వసూలు చేస్తున్నట్లు ఆయనకు చెప్పారు. పెద్ద వ్యాపారులు, చిరు వ్యాపారులతో వేర్వేరుగా మాట్లాడారు. మహిళా వ్యాపారులు కొందరు అధిక వసూళ్ల తీరును చెప్పారు. ఇకపై ఫిర్యాదులు వస్తే అరెస్టు చేస్తానని హెచ్చరించారు.

భూగర్భ డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించండి: కందుల నాగరాజు

అల్లిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 32వ వార్డు నేరెళ్ల కోనేరు నుంచి చావుల మదుం వరకు సుమారు రూ.20 లక్షల వ్యయంతో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులను వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. .దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో వార్డులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తా : మళ్ల సురేంద్ర

అల్లిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గవర వర్గీయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు గవర సంక్షేమాభివృద్ధి సంస్థ చైర్మన్ మళ్ల సురేంద్ర అన్నారు. ఈ బాధ్యతను తనకు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, కూటమి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం అల్లిపురంలో గౌరీ పరమేశ్వరుల లను దర్శించుకుని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విల్లూరి చక్రవర్తి, శరగడం భాస్కర్, మళ్ల వెంకటరావు పాల్గొన్నారు.



గౌరీ పరమేశ్వరుల వద్ద సురేంద్ర తదితరులు

ప్రతిభావంతులకు ఉపాధి అవకాశాలు

డాబాగార్డెన్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రాండ్ హయత్ జనరల్ మేనేజర్ మార్క్ స్టెర్న్ జియల్ ప్రసంగిస్తూ ప్రస్తుతం ఆతిథ్య రంగానికి విశేషమైన ఆదరణ ఉందన్నారు. వినూత్న వంటలు, స్వచ్ఛమైన ఆహారం, స్వాగత డెస్క్, హౌస్ కీపింగ్ వంటి విభాగాల్లో ఉపాధి లభిస్తుందన్నారు. సోమవారం సన్ క్యాంపస్‌లో గ్రాండ్ హయత్, ది యూనియన్ స్టేషన్ నాస్ విల్లె సంయుక్త ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ యూఎస్ఏ జే1 క్యాంపస్ డ్రైవ్' నిర్వహించారు. హెచ్ఆర్ మేనేజర్ గిడియాన్ ప్యాకినాథన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికిసేందుకు క్యాంపస్ డ్రైవ్ దోహద పడుతుందన్నారు. సన్ ఇనిస్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి మాట్లాడుతూ సుమారు 150 మంది విద్యార్థులు యు.ఎస్.ఎ.లో ఉద్యోగాలు సాధించేందుకు ప్రతిభను ప్రదర్శించారని తెలిపారు. ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్యాంపస్ డ్రైవ్‌లో విద్యార్థినీ, విద్యార్థులతో నిపుణులు

బడ్జెట్ ఆశాజనకం

... 5వ పేజీ తరువాయి

నిర్మాణానికి రూ.6 కోట్లు కేటాయించారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, రాయితీల కింద రూ.452.31 కోట్లు కేటాయించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పాత బకాయిలు వస్తాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది. క్రీడలకు రూ.100 కోట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ ఆడిటోరియాలకు నూతన హంగులు సమకూరనున్నాయి. విశాఖలో ప్రాంతీయ గ్రంథాలయం అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించారు.

పోలీసు స్టేషన్లలో మౌలిక వసతులకు రూ.58 కోట్లు

నగరంలో పోలీస్ కమిషనరేట్‌కు కొత్త భవనం, మహారాణిపేట, సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్లకు కొత్త భవనాలు, ఆరిలోవలో ఏసీపీ కార్యాలయ భవనం నిర్మాణాలకు రూ.58 కోట్లు కేటాయించారు. నగరంలో కౌమార బాలుర వసతిగృహ భవనానికి రూ.42లక్షలు కేటాయించారు.

ఏయూకు రూ.389.34 కోట్లు

ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపునకు బడ్జెట్‌లో రూ.389.34 కోట్లు కేటాయించారు. గత ఏడాది రూ.387.18 కోట్ల విడుదల చేయగా, ఈ ఏడాది రెండు కోట్లు పెరిగింది. వర్సిటీ అధికారులు రూ.500 కోట్లకు ప్రతిపాదించారు. వర్సిటీలో 3,500 మంది పెన్షనర్లు, 2,500 మంది ఉద్యోగులున్నారు. వీరికి ప్రతినెలా రూ.33 కోట్లు చెల్లించాలి.

అంధులకు హోమ్ ఏర్పాటు

విశాఖలో అంధుల కోసం ప్రత్యేకంగా హోమ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించింది. బడ్జెట్‌లో ప్రత్యేకంగా దీనిని ప్రస్తావించారు. ఈ హోమ్‌లో ఉండే వారికి ఉచితంగా భోజనం, వసతి, వైద్యం, వస్త్రాలు సమకూరుస్తారు.

జీవీఎంసీకి రూ.20 కోట్లు

స్మార్ట్‌సిటీ మిషన్‌లో భాగంగా జీవీఎంసీకి రూ.20 కోట్లు కేటాయించారు. మిషన్ ఫర్ డెవలప్‌మెంట్ స్మార్ట్ సిటీస్ కింద రాష్ట్రంలో వంద నగరాలను అభివృద్ధి చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జీవీఎంసీ పరిధిలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులకు కేటాయించింది.

ఏపీ స్టడీ సర్కిల్‌కు రూ.8 కోట్లు..

రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ, తిరుపతిలో ఏపీ స్టడీ సర్కిల్స్ ఉన్నాయి. వీటి కోసం రూ.8 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. విద్యార్థులకు ఉచితంగా శిక్షణ, మెటీరియల్ అందించేందుకు ఈ నిధులు వినియోగిస్తారు.

సూపర్ సిక్స్ పథకాలకు నిధుల్లేవు



సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీల అమలుకు ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో వాటిని విస్మరించారు. సంక్షేమ పథకాలకు భారీగా కేటాయించారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ఉండాలి. విశాఖలో కీలక ప్రాజెక్టులకు కేటాయింపులు లేవు. గతంతో పోలిస్తే కొన్నిశాఖలకు మెరుగ్గా ఉన్నాయి. వ్యవసాయానికి నిధులు పెరిగాయి.

- అడ్డాల వెంకటవర్మరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

నగరం... కాలుష్య కాసారం!

... 5వ పేజీ తరువాయి

కాలుష్యకారకాలు 2020లో కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో, అదీ ప్రధానంగా ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు పీఎం 2.5 విలువ 40, పీఎం 10 విలువ 100 కంటే తక్కువగా నమోదైంది. లాక్‌డౌన్ ఎత్తివేసిన తరువాత ఈ రెండింటి విలువలు పరిధికి మించిపోయాయి. గాలిలో నాణ్యత నిర్ధారించడంలో ధూళి కణాలు కీలకంగా మారినట్టు పరిశోధనలో వెల్లడైంది. కేంద్ర కాలుష్య నియంత్రణమండలి నిర్ధారించిన ప్రమాణాల మేరకు పీఎం 10 విలువ 60, పీఎం 2.5 విలువ 40గా ఉండాలి. అయితే నగరంలో పలుమార్లు పీఎం 2.5 విలువ 202, పీఎం 10 312గా నమోదయింది. దేశవ్యాప్తంగా నమోదైన ప్రమాణాల కంటే విశాఖలో ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

కాలుష్య కారకాలివీ...

నగరంలో గాలిలో ధూళి కణాల స్థాయి, కాలుష్య తీవ్రతకు అనేక కారణాలున్నాయి. విశాఖ పోర్టు నుంచి బొగ్గు దిగుమతి, రవాణా, నగర శివారులో రెండు బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచి వచ్చే ధూళి కణాల వల్ల కాలుష్యం పెరుగుతోంది. ధూళి కణాలతోపాటు ఆర్సెనిక్, జింక్, క్రోమియం వంటి కాలుష్య కారకాలను వాతావరణంలో విడుదల చేస్తున్నాయి. తీర ప్రాంత నగరం కావడంతో సముద్రం నుంచి వచ్చే ఉప్పు ప్రభావం ఎక్కువ. పారిశ్రామిక ప్రాంతం కావడంతో నగరంలో రోజువారీ ఉత్పత్తయ్యే బయోమాస్‌ను కాల్చడం వల్ల పొటాషియంతో కూడిన ధూళి కణాలు కమ్మేస్తున్నాయి. మెటల్, పెట్రోలియం రంగాల నుంచి వచ్చే ఉద్గారాలు, ట్రాఫిక్‌తో దుమ్మధూళి కూడా గాలిలో కాలుష్యం పెరిగేందుకు కారణమవుతోంది.

భవిష్యత్తు దిక్సూచి

మెషీన్ లెర్నింగ్ విధానంతో నగరంలో భవిష్యత్తు కాలుష్య తీవ్రతను అంచనావేయవచ్చునని పరిశోధనా పత్రం వెల్లడించింది. పారిశ్రామిక కార్యకలాపాలు కూడా కాలుష్యం పెరిగేందుకు కారణంగా పేర్కొంటున్నారు. నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మెరుగుపరచాలంటే స్వచ్ఛత, శుభ్రతపై దృష్టిసారించాలని రాజాంలో జీఎంఆర్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ఆచార్యుడు డాక్టరు కార్తీక్ అభిప్రాయపడ్డారు. ఎలక్ట్రికల్, హైబ్రిడ్ వాహనాలను ప్రోత్సహించడం, శిలాజ ఇంధనంపై ఆధారపడడం తగ్గించే దిశగా నగరం ముందుకెళ్లాలని సూచించారు. గాలిలో ధూళి కణాలు విడుదలకాకుండా పరిశ్రమల్లో అధునాతన వాయు కాలుష్య నియంత్రణ పరికరాలు అమర్చే విధానాలు అమలు చేయాలన్నారు.

బీఈడీ విద్యార్థుల పరేషాన్

... 5వ పేజీ తరువాయి

అనుబంధ కాలేజీలకు చెందిన కొందరు ప్రిన్సిపాల్స్ ఉంటారు. వీరు రికార్డులను అవాల్యుయేషన్ చేసి మార్కులు ఇస్తారు. ఈ విధానంలో ప్రక్రియ పకడ్బందీగా సాగేది. అయితే గత వర్సిటీ పాలకులు ఈ విధానాన్ని మార్చేశారు. తొలుత రికార్డుల అవాల్యుయేషన్ ప్రక్రియను కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించారు. ప్రస్తుతం ఈ విధానంలోనూ మార్పులు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఆన్‌లైన్ సమస్యలు

ప్రతి విద్యార్థికి వర్సిటీ అధికారులు ఒక లాగిన్ ఐడీ ఇచ్చారు. ఇందులోంచి రికార్డులు రాసేందుకు అవసరమైన కొన్ని బార్‌కోడ్‌తో పేపర్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఈ పేపర్లలో రికార్డువర్క్‌ను పూర్తిచేసి మళ్లీ అదే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఒక్కో సెమిస్టర్‌కు ఏడు నుంచి 11 రికార్డులుంటాయి. ఒక్కో రికార్డులో కనీసం 50 నుంచి 70 పేపర్లుంటాయి. వందలాది పేపర్లను ఆన్‌లైన్‌లో పీడీఎఫ్ రూపంలో అప్‌లోడ్ చేయాల్సి రావడం ఇబ్బందిగా మారుతోందని పలు వురు వాపోతున్నారు. ఇందుకోసం భారీగా ఖర్చు అవుతోందని చెబుతున్నారు. వర్సిటీ అధికారులు పేపర్ డౌన్‌లోడ్ చేయడానికి, రికార్డులు అప్‌లోడ్ చేయడానికి కొంత సమయం ఇస్తున్నారు. ఆలోగా ప్రక్రియ పూర్తిచేయలేకపోతే రూ.2 వేలు వరకు జరిమానా చెల్లించాల్సి వస్తోంది. కొన్ని సార్లు కళాశాలల యాజమాన్యాలు, వర్సిటీ నుంచి సమాచారం రావడం ఆలస్యమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విధానాన్ని మార్చి గతంలో మాదిరిగా రికార్డులు రాసి కళాశాలల్లోనే అప్పగించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు. అంతేకాకుండా గతంలో వర్సిటీ మోడరేషన్ బోర్డు ఆధ్వర్యంలో అవాల్యుయేషన్ ప్రక్రియను నిర్వహించడం వల్ల పారదర్శకత ఉండేదని, ప్రస్తుతం బయటివారికి అప్పగించడం వల్ల సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. రాష్ట్రంలోని ఎక్కడా లేని విధంగా ఏయూలో మాత్రమే ఈ విధానం అమలు చేస్తుండడంపై మండిపడుతున్నారు.

ఆర్థిక భారం

విశ్వవిద్యాలయం పరిధిలో 53 బీఈడీ కాలేజీల్లో సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరు ఒక్కో సెమిస్టర్‌కు ఏడు నుంచి 11 రికార్డులు సమర్పించాలి. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు కనీసం రూ.3 వేలు వరకు ఖర్చవుతోంది. జాప్యం జరిగి ఫైన్ చెల్లించాల్సి వస్తే మరింత భారం పడుతుంది. కొన్నిసార్లు సర్వర్ సమస్యతో డౌన్‌లోడ్, అప్‌లోడ్ కాకపోవడం వంటి ఇబ్బందులు ఎదురైతే మరింతగా జేబుకు చిల్లు పడుతోందని వాపోతున్నారు.

35 శాతమే జీతం

... 5వ పేజీ తరువాయి

ఉత్పత్తి జరుగుతుంది. ఇక్కడ ఉద్యోగుల్లో 70 శాతం మంది ప్రతిరోజూ 150 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన వాతావరణంలో పనిచేస్తారు. అంత కష్టపడినా వారి శ్రమను యాజమాన్యం గుర్తించడం లేదు. పూర్తిస్థాయి జీతం చెల్లించడం లేదు. పైగా కోతలు పెంచుకుంటూ పోతోంది.

35 శాతం జీతంతో బతకడమెలా?

స్టీల్‌ప్లాంటులో పనిచేసే ఉద్యోగికి సగటున కోతలు పోను రూ.40వేల జీతం వస్తుంది. అందులో సగమే చెల్లిస్తుండడం తో దానిని అలవాటు చేసుకున్నారు. అంటే రూ.20వేలు. తాజాగా 35 శాతమే ఇచ్చారు. అంటే రూ.13,500 వరకు వస్తుంది. ఈ మొత్తంతో భార్య, ఇద్దరు పిల్లలతో ఎలా జీవించాలని ఉద్యోగులు వాపోతున్నారు. యాజమాన్యం కావాలనే ఇలా చేస్తున్నదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. జీతాలు ఇవ్వని సంస్థలో పనిచేయడం మానేసి, స్వచ్ఛందంగా ఉపాధి వెదుక్కునేలా చేస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఉద్యోగుల సంఖ్య తగ్గించుకొని, ఆ తరువాత ప్రైవేటుకు ప్లాంటును అప్పగించాలని యోచిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.

నిధులున్నా ఇవ్వడం లేదు

యాజమాన్యం వద్ద నిధులు లేని సమయంలో జీతాలు ఇవ్వకపోయినా ఆందోళన చెందలేదు. ఇప్పుడు బ్యాంకుల్లో మొత్తం రూ.950 కోట్ల నిధులున్నాయి. వాటిలో పది శాతం కంటే తక్కువ ఉద్యోగులకు జీతాలు ఇవ్వొచ్చు. సెప్టెంబరు బకాయి 50 శాతం ఇవ్వకుండా అక్టోబరు జీతాలు ఎలా ఇచ్చారో అర్థం కావడం లేదు. ఎవరితో చర్చించి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారో వెల్లడించాలి. ఉద్యోగుల సహనాన్ని పరీక్షిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుంది. తక్షణమే జీతాల బకాయిలన్నీ చెల్లించాలి.

- అయోధ్యరామ్, కన్వీనర్, ఉక్కు పోరాట కమిటీ

శ్రీవిశ్వ జూనియర్ కళాశాలకు షోకాజ్

... 5వ పేజీ తరువాయి

సందర్భంగా పిల్లలకు బిర్యానీ, రొయ్యలు, గుడ్లు, చేపలతో భోజనం వడ్డించారు. అక్కడ మిగిలిన ఆహారాన్ని లాసన్స్‌బేకాలనీలో శ్రీవిశ్వ జూనియర్ కళాశాల బాలికల హాస్టల్‌కు తరలించారు. రాత్రి అదే ఆహారాన్ని అందించారు. ఉదయం వండిన ఆహారం కావడంతో ఫుడ్ పాయిజనింగ్ జరిగి ఏడుగురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని ఆస్పత్రికి తరలించారు. ఇంటర్‌బోర్డు ఆర్ఐవో మురళీధర్ ఇతర అధికారులు ఆస్పత్రికి వచ్చి పరిశీలించారు. కలెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. సోమవారం ఉదయం బాలికల ఆరోగ్యం కుదుటుపడడంతో జనరల్ వార్డుకు తరలించారు. కలెక్టర్ ఆదేశాలతో సోమవారం మధ్యాహ్నం హాస్టల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు జగన్నాథరావు నేతృత్వంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కాగా లాసన్స్‌బేకాలనీలో హాస్టల్ నిర్వహణకు అనుమతిలేదని ఇంటర్‌బోర్డు అధికారుల తనిఖీలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యానికి షోకాజ్ జారీచేశారు. తదుపరి చర్యలకు ఇంటర్‌బోర్డు అధికారులు నిర్ణయించారు.


ఆటోనగర్ ఆలయంలో చందనభరితంగా పూజలందుకున్న స్ఫటిక శివలింగం


అప్పికొండలో పూజలందుకున్న సోమేశ్వరస్వామి


లింగాల తిరుగుడి ఆలయంలో భక్తుల పూజలు

ఓం నమశ్శివాయ..


86వ పరిధి మాతృశ్రీ నగర్ శివాలయంలో పుష్పాలు, తులసీదళాలతో శివలింగం

కార్తీక మాసం రెండో సోమవారం భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

ఉక్కుటౌన్‌షిప్ /గాజువాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస రెండో సోమవారం పూజలను పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శైవక్షేత్రాలన్నీ హరహర మహాదేవ శంభో శంకర.. ఓం నమశ్శివాయ అన్న నామస్మరణలతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో శివాలయాలకు విచ్చేసి పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. అతి పురాతనమైన అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము మూడు గంటల నుంచే శివయ్యకు ప్రత్యేక పూజలు జరిపారు. స్వామివారి దర్శనానికి వందలాది మంది భక్తులు తరలిరావడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో అల్లు జగన్నాథరావు తగిన చర్యలు చేపట్టారు. గాజువాక సనత్‌నగర్‌లోని ఏకాంబరేశ్వరాలయంలో అర్చకులు కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉక్కు శివాలయంలో జరిగిన పూజాది కార్యక్రమాల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం/ఆటోనగర్: జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడిలో శ్రీసీతారామలింగేశ్వరస్వామి ఆలయంలోని బ్రహ్మ సూత్ర శివలింగం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. పూజాది కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, ఆలయ కమిటీ సభ్యులు తాతనాయుడు, గోవింద్, ఎం.రాము, కృష్ణ, గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు. 86వ వార్డు మాతృశ్రీనగర్ శ్రీకాశీఅన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వరాలయంలో ఆలయ ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిల ఆధ్వర్యంలో శివలింగానికి పూజలు, హోమాలు జరిపారు. 88వ వార్డు ఎస్టీబీఎల్‌లోని ఉమారామలింగేశ్వరస్వామికి అర్చకులు చంద్రమౌళీశర్మ పర్యవేక్షణలో విభూది, రుద్రాక్షలతో అలంకరించి పంచామృతాభిషేకాలు, పూజలు చేయగా, ఎస్టీబీఎల్ ప్రతినిధులు బాలాజీ, జీవీ కృష్ణయ్య, గంగామహేశ్, చైతన్యకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే 71వ వార్డు ఆటోనగర్, తోకాడలో శ్రీదుర్గామల్లికార్జునస్వామి ఆలయంలో అర్చకులు తరుణ్ శర్మ స్ఫటిక శివలింగానికి విభూది, రుద్రాక్షలతో అలంకరించి పంచామృతాభిషేకాలు, పూజలు, రుద్ర హోమం జరిపారు.

అగనంపూడి: పెదమడక ఉమామహేశ్వరాలయం, పాత అగనంపూడి లింగాల తిరుగుడి, కర్రివానిపాలెంలోని శైవక్షేత్రాలకు తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. శివలింగాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్తీక మాసం దృష్ట్యా ఆలయంలో నిత్యం ప్రత్యేక పూజలు జరుపుతున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు బి.నాగేశ్వరరావు, కె.జగదీశ్, పైడిరాజు, గుర్రం శ్రీను, కరణం సత్యారావు, డి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ఇక్కడి బాలచెరువు ఉమారామలింగేశ్వరాలయం,దుర్గవానిపాలెం రామలింగేశ్వరాలయం, గిరిజా కాలనీ, వికాస్ నగర్‌లోని శివాలయం, వెంకన్నపాలెం ఈశ్వరాలయం, నెల్లిముక్కులోనికాశీవిశ్వేశ్వరాలయం, నడుపూరులోని చంద్రశేఖరాలయం, రాజీవ్ రోడ్డులోని విశ్వేశ్వరాలయాల్లో నిర్వహించిన పూజలు, అభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గిరిజా కాలనీ శివాలయంలో స్వామివారికి అభిషేకించిన పాలను బాగా కాచి భక్తులకు తీర్థంగా పంపిణీ చేశారు. సాయంత్రం పలు ఆలయాల్లో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.


బాలికల జట్టుకు ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్, తదితరులు

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల విజేత విశాఖ

కూర్మన్నపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-14 బాలబాలికల నెట్‌బాల్ ఫైనల్స్ పోటీల్లో విశాఖ జిల్లా క్రీడాకారులు చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. అండర్-14 బాలుర పోటీల్లో విశాఖ జిల్లా ప్రథమ, తూర్పు గోదావరి, అనంతపురం జిల్లా జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే అండర్-14 బాలికల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విశాఖ, పశ్చిమగోదావరి, వైఎస్సార్ కడప జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ ఎంఎస్ఎంఈ డీసీ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ విజేతలకు ట్రోఫీలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు పోటీతత్త్వంతో పాటు క్రీడా స్ఫూర్తి కలిగి ఉన్నప్పుడే విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్‌లో రాణించే క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, డిప్యూటీ డీఈవో సీహెచ్ రవీంద్రబాబు, ఎంఈవో సునీతల, స్కూల్ హెచ్ఎం బి.సూర్యప్రకాశ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.మన్నాజీ, నారాయణరావు, కూటమి నాయకులు పీలా రామకృష్ణ, ఎస్ఎస్ విజయరామరాజు, కాదా శ్రీను, వి.రాంబాబు, బి.నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ స్కేటింగ్ రింక్ క్రీడాకారులకు అభినందనలు


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ అమిత్, తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మంగళగిరిలో జరిగిన 36వ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్టీల్ ప్లాంట్ రింక్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ రింక్ క్రీడాకారులు ఐదు బంగారు, ఐదు సిల్వర్ పతకాలతో పాటు పలు బహుమతులు సాధించినట్టు క్రీడా విభాగం అధికారులు, కోచ్ అమిత్ గడాయ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఇక్కడి స్కేటింగ్ రింక్‌లో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ స్కేటింగ్ పోటీలు జరిగినా స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు పతకాలు సాధిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోచ్ కాశీ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలకు చందనశ్రీ ఎంపిక



అగనంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జిమ్నాస్టిక్స్ క్రీడా పోటీలకు అండర్-19 బాలికల విభాగంలో ఉక్కునగరం లిటిల్ ఏంజిల్స్ పాఠశాల పదో తరగతి విద్యార్థిని కింతాడ చందనశ్రీ ఎంపికైంది. ఇటీవల కాకినాడ స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ క్రీడా పోటీల్లో చందన మంచి ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలవడంతో డిసెంబరులో కోల్‌కతాలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది చందనశ్రీని అభినందించారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

అగనంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిరుపేద విద్యార్థి కాండ్రేగుల కుమార్ వెంకటశివరామను ఆర్థికంగా ఆదుకునేందుకు స్థానికంగా దాతలు ముందుకు వచ్చారు. సమాచార హక్కు చట్టం ఉద్యమ కర్త పట్టా రామ అప్పారావు చేతుల మీదుగా రూ.11 వేల చెక్కును అందజేశారు. ఎంబీబీఎస్ కోచింగ్‌కు అవసరమైన నగదును తాము చెల్లిస్తామని రామ అప్పారావు పేర్కొన్నారు. కార్యక్రమంలో దాతలు నిమ్మకూరి రమేశ్, బొండా ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భర్త చెంతకు భార్య, పిల్లలు

కూర్మన్నపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళ తన ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి వెళ్లిపోగా వారిని తిరిగి భర్తకు దువ్వాడ పోలీసులు అప్పగించారు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇక్కడి మదీనాబాగ్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబం కూలి పనులు చేసూకుంటూ జీవనం సాగిస్తుంది. మతిస్థిమితం లేని తన భార్య సంగీత ఇద్దరు పిల్లలతో పాటు కనిపించడం లేదంటూ భర్త మహేంద్ర సహానీ ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాజువాక పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఎస్ఐ రవికుమార్ వారిని పిల్లలతో ఉన్న సంగీతను గమనించి వారిని రాత్రికి గాజువాక మహిళా గృహంలో ఉంచి సోమవారం దువ్వాడ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఫిర్యాదుదారున్ని పిలిచి భార్యాపిల్లలను అప్పగించారు.

'అందరూ మొక్కలు నాటాలి'

కూర్మన్నపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావులు అన్నారు. సోమవారం కూర్మన్నపాలెంలో ఓ ప్రైవేట్ స్కూల్, తరుమిత్ర ఏకో క్లబ్ నిర్వాహకుల ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలుష్య నివారణకు విధిగా మొక్కలు నాటాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


ఫ్లాష్‌మాబ్‌లో పాల్గొన్న విద్యార్థులు

'టీఎస్సార్ టీబీకే'లో ముగిసిన యువజనోత్సవాలు

ఆటోనగర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో యువత ప్రత్యేక భూమికను పోషించి నిస్వార్థ సేవలను అందించాలనీ టీఎస్సార్ టీబీకే కళాశాల చైర్మన్ తలశిల బలరామకృష్ణ అన్నారు. శ్రీనగర్ టీఎస్సార్ టీబీకే కళాశాలలో స్పెండర్-2024 రెండు రోజుల యువజనోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన ఫాష్‌మాబ్ అందరినీ ఆకట్టుకుంది. కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు యువజనోత్సవాల్లో పాల్గొని రంగోలి, క్విజ్, లఘు చిత్రాలు, జానపద నృత్య పోటీల్లో పాల్గొన్నారన్నారు. విజేతలకు షీల్డులు, ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు, వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్ సంపత్‌కుమార్‌కు సమస్యలను వివరిస్తున్న అధికారులు

68, 69వ వార్డుల్లో కమిషనర్ పర్యటన

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 68, 69వ వార్డుల్లో సోమవారం కమిషనర్ సంపత్‌కుమార్ పర్యటించారు. 69వ వార్డులో పలు కాలనీలను వరద ముంపునకు గురిచేస్తున్న అవుట్‌లెట్‌లను పరిశీలించారు. హైవే నుంచి గెయిల్‌కు ఆనుకుని ఉన్న కాలువ పూడికుపోయి ఉండడంపై అధికారులను ప్రశ్నించారు. తక్షణమే కాలువల్లో నీరు సజావుగా పారేలా తగిన చర్యలు చేపట్టాలని జోనల్ అధికారులకు ఆదేశించారు. ఏరియల్ సర్వే చేసి ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో ముంపు సమస్యలు లేకుండా చూడాలని గ్లో చైర్మన్ యార్లగడ్డ వెంకన్నచౌదరి, స్థానిక నాయకులు గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, తదితరులు కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో గాజువాక జెడ్సీ శేషాద్రి, ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హర హర శంభో..

- కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిట
- వేకువజాము నుంచి స్వామివారికి విశేష అర్చనలు, అభిషేకాలు

గోపాలపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కార్తీక సోమవారం సందర్భంగా పట్టణంలోని శైవక్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. వేకువజాము నుంచి స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. గోపాలపట్నంలోని చంద్రమౌళీశ్వర ఆలయం వద్ద భక్తులు బారులుతీరి కనిపించారు. అలాగే, భీమేశ్వరాలయం, కొత్తపాలెం ఉమానాగలింగేశ్వర ఆలయం, ఎంఈఎస్ పంపుహౌస్ వద్ద గల పార్వతీ సహిత చంద్రశేఖర ఆలయం, నరవ గ్రామంలోని పురాతన ఉమానాగలింగేశ్వర ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.

పెందుర్తి మండలంలో...

పెందుర్తి : మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సరిపల్లిలో గల స్వయంభూ శివాలయంలో భక్తులు క్షీరాభిషేకం చేశారు. పినగాడిలో గల చోడేశ్వర శివాలయంలో చోడేశ్వర స్వామికి పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం పెద్ద సంఖ్యలో మహిళలు ధ్వజస్తంభం వద్ద దీపాలంకరణ చేపట్టారు. అలాగే, పెందుర్తి, ప్రశాంతినగర్, చినముషిడివాడ శ్రమశక్తినగర్, రత్నగిరినగర్ ప్రాం తాల్లో గల శివాలయాల్లో భక్తుల కోలాహలం నెలకొంది.


గోపాలపట్నంలోని చంద్రనగర్ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పెందుర్తి రూరల్ : మండలంలోని గవరపాలెంలో గల కేదారేశ్వర స్వామి ఆలయంలో నూకాలమ్మ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ ముమ్మన దేవుడు హాజరై అన్నసమారాధనను ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి గోపీవెంకటలక్ష్మి, దాడి అప్పలనాయుడు, కాళ్ల సురేశ్, పీడీవీ ప్రసాద్, పెంటకోట శంకర్, మద్దాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట పరిధిలో...

వేపగుంట : జీవీఎంసీ 93, 94 వార్డుల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం రెండు సోమవారం సందర్భంగా కృష్ణానగర్ గుడి వీధిలో కొలువుదీరిన దుర్గామల్లేశ్వర ఆలయం, రవినగర్‌లోని ఉమాశంకర ఆలయం, వేపగుంట కొండపైన ఉన్న శివాలయం, ముత్యాలమ్మ గుడి ఆవరణలో ఉన్న శివాలయం, ప్రహ్లాదపురం శివాలయంలో వేకువజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు.


పెందుర్తి మండలం పినగాడి చోడేశ్వర శివాలయంలో స్వామివారు

ఎన్ఏడీ జంక్షన్ ఏరియాలో...

ఎన్ఏడీ జంక్షన్ : జీవీఎంసీ 90వ వార్డు, 52వ వార్డు పరిసర ప్రాంతాల్లోని శైవక్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. ఎన్ఏడీ గణేష్‌నగర్‌లో కొలువుదీరిన ఉమావిశ్వేశ్వర, కుమారస్వామి దేవస్థానం, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో గల ఉమాశంకర గణపతి ఆలయం, సుసర్లకాలనీ దరి సీతారామరాజునగర్‌లో పార్వతీ చంద్రమౌళీశ్వరాలయం, కాకానినగర్ శివాలయంలో అర్చకులు స్వామివారికి విశేష పూజలు జరిపారు.

ఓటరు నమోదుకు నేటి నుంచి అవగాహన సదస్సులు

పెందుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్న ఉద్దేశ్యంతో కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అర్జున్‌రావు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం గోపాలపట్నం పవర్ ఆఫీస్ సమీపంలో ఉన్న ఆళ్వార్‌దాస్ కళాశాలలో, బుధవారం పెందుర్తిలోని విస్డమ్ ఇంజనీరింగ్ కళాశాలలో స్వీప్ పేరిట సదస్సులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించనున్నామని వివరించారు. కళాశాలల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ప్రజా సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ

వేపగుంట నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పది మంది హాజరై తమ సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. వీటిలో ముఖ్యంగా 90వ వార్డు నరసింహనగర్‌లో అక్రమ నిర్మాణం నిలుపుదల చేయాలని, 92వ వార్డులో ప్రజా సమస్యలు పరిష్కరించాలని, 95వ వార్డు సుజాతానగర్ ఏరియా సర్వే నెంబరు 179/2లో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని పలువురు కోరారు. అలాగే, సుజాతానగర్-బి జోన్‌లో డ్రేనేజీ కాలువకు మరమ్మతులు చేపట్టాలని, 96వ వార్డులో వితంతు పింఛన్ సమస్యను పరిష్కరించాలని 98వ వార్డులో సింహాచలం మాధవి కల్యాణ మండపంపై అక్రమ నిర్మాణం తొలగించాలని ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత విభాగాలకు పంపించి చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ కె.హైమావతి తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

శ్రీనగర్,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 71వ వార్డు దుర్గానగర్ ప్రజల ఆరాధ్య దేవత శ్రీకనకదుర్గమ్మ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గమ్మను వెండికవచ ధారణతో అర్చకులు అలంకరించి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు చేశారు. పలువురు మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. జనసేన పార్టీ నాయకుడు కరణం కనకారావుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు దుర్గమ్మను దర్శించుకున్నారు.

సినిమా గైడ్

- **అపుడో, ఇప్పుడో, ఎప్పుడో:** కిన్నెర, సంగం, గోకుల్, మౌర్య (గోపాలపట్నం) కన్య కాంప్లెక్స్ (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం),
- **ధూం, ధాం :** శారద, మోహిని (గాజువాక)
- **జితేందర్‌రెడ్డి :** శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్-3 (గాజువాక)
- **క :** జగదాంబ, శ్రీరామ, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **లక్కీ భాస్కర్:** మెలోడి, శరత్,కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **అమరన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్‌నటరాజ్-1 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **బఘీర :** వెంకటేశ్వర, శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ)
- **దేవర :** రమాదేవి, శ్రీకన్య (గాజువాక). తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 28, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 50, బెండకాయలు 36, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 40, బీరకాయలు 30, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 44, క్యాబేజీ 34, క్యారెట్ 52 దొండకాయలు 30, బంగాళదుంపలు 40, అరటికాయ (పెద్దది) 6, మునక్కాడలు (కిలో) 46, అల్లం (పాతది) 60, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 76, గోరుచిక్కుడు 40, దోసకాయలు 36, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 64, పొటల్స్ 42, కీరదోస 28, కాప్సికమ్ 78, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడదుంపలు 30, కంద 72, దేముడు చిక్కుడు 70, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 45, మామిడి అల్లం 60, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
ఫారం ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

▸ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కాంట్రాక్టు కార్మికులను అడ్డుకున్న యూనియన్ నేతలు


హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద ఆగిపోయిన కార్మికులు

మల్కాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వివిధ కార్మిక సంఘాల నాయకులు సోమవారం అడ్డుకున్నారు. సుమారు ఐదువందల మంది కార్మికులు లేబర్ గేటు ద్వారా హెచ్‌పీసీఎల్‌లోకి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా, ఒక్కసారిగా కార్మికులంతా అక్కడికి చేరుకొని సంస్థలోకి వెళ్లడానికి వీలులేదని, తమకు ఉపాధి కల్పిస్తేనే మీకు ఉపాధి దక్కుతుందని అడ్డుకున్నారు. గత కొంత కాలంగా స్థానికులకు ఉపాధి కల్పించాలని కాంట్రాక్టర్లు చుట్టూ తిరుగుతున్నా కాలయాపన చేస్తున్నారే తప్ప, ఏమాత్రం పట్టించుకోవడం లేదని కార్మిక నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోను కార్మికులను అడ్డుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఈ విషయంలో కార్మిక శాఖ అధికారులు, హెచ్‌పీసీఎల్ అధికారులు కల్పించుకొని స్థానికులకు న్యాయం జరిగేలా చూడాలని వారంతా కోరారు.

ఒక్క రోజులోనే వెయ్యి మందికి టీడీపీ సభ్యత్వం

▸ పార్టీ నాయకుడు దినకర్


టీడీపీ సభ్యత్వాన్ని అందజేస్తున్న పార్టీ నాయకుడు దినకర్

మల్కాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 59వ వార్డులో ఒక్కరోజులోనే ఏడు వార్డుల టీడీపీ నాయకుడు విశ్వనాధుల దినకర్ నేతృత్వంలో వెయ్యి మంది పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించడం విశేషం. ఈ సందర్భంగా ఏర్పా టైన సమావేశంలో దినకర్ మాట్లాడుతూ సభ్యత్వాన్ని పొందిన ప్రతి ఒక్కరికీ రూ.ఐదు లక్షల బీమా ఉంటుందన్నారు. పశ్చిమ నియోజక వర్గంలో ఉన్న అన్ని వార్డులంటే ఈ వార్డులోనే అధిక సంఖ్యలో సభ్యులు చేరేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏ నిర్ణయం తీసుకున్నా అది రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసమేనని స్పష్టం చేశారు. వార్డు టీడీపీ ప్రధాన కార్యదర్శి మిరెడ్డి శంకర్, సీనియర్ నాయకులు పూడి భాస్కరరావు, దేవర ఈశ్వరరావు, బీజేపీ నాయకులు సతీష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య కేసులో ఐదుగురి అరెస్టు

గోపాలపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కుటుంబీకుల వేధింపులు తాళలేక యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో ఐదుగుర్ని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం గ్రామంలోని నాగేంద్ర కాలనీలో ఈ నెల ఆరో తేదీన భాగ్యలక్ష్మి (19) అనే నర్సింగ్ విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా యువతి మృతదేహానికి ఆమె అన్నయ్య పున్నాన ఈశ్వరరావు అలియాస్ యేసుబాబు అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో యువతి మృతిపై అనమానం ఉన్నట్టు కొందరు స్థానికులు గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతురాలి అన్న, వదినలు ఈశ్వరరావు, వాగ్దేవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు మృతదేహానికి దహన సంస్కారాలు నిర్వహించడంలో సహాయపడిన డి.కేశవరావు, ఎ.శేఖర్, ఎ.సురేశ్‌లను కూడా అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు యువతిని వేధింపులకు గురిచేయడంతో పాటు గుట్టుచప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించినందుకు కేసు నమోదు చేసి, ఈ ఐదుగుర్నీ సోమవారం రిమాండ్‌కు తరలించినట్టు సీఐ కె.సురేశ్ తెలిపారు.

'16న చేపట్టే విద్రోహ దినాన్ని విజయవంతం చేయండి'

మల్కాపురం నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ 95 పెన్షన్ ప్రవేశపెట్టిన రోజునే ప్రతి సంవత్సరం ఏపీ ఆర్‌పీఏ దేశ వ్యాప్తంగా విద్రోహ దినంగా ప్రకటించడం జరిగిందని పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్ తెలిపారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16వ తేదీన జీవీఎంసీ గాంధీ బొమ్మ వద్ద విద్రోహ దినం కార్యక్ర మాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. పార్టీలకు అతీ తంగా పెన్షనర్లు అంతా తరలి రావాల్సిందిగా కోరారు. పెన్షనర్ల సంఘం ప్రతినిధి తమ్మారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కె.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయ లోగిలి

గిరి గ్రామదర్శిని

ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలకు ప్రతీక

(అరకులోయ- ఆంధ్రజ్యోతి)

గిరిజనుల ఆచార, వ్యవహారాలు, సంప్రదాయాలు, జీవన విధానం కళ్లకు కట్టినట్టు ఉండే ప్రాంతమే గిరి గ్రామదర్శిని. ఇక్కడ గిరిజనుల జీవన విధానానికి సంబంధించిన అనేక రకాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. సందర్శకులు గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో వివాహం చేసుకునే సౌలభ్యం ఇక్కడ ఉండడంతో దీనికి ప్రత్యేకత సంతరించుకుంది.

» ఆదివాసీల పద్ధతిలో పెళ్లి చేసుకోవడం ఇక్కడి ప్రత్యేకత



గిరి గ్రామదర్శిని

అరకులోయ ప్రాంతాన్ని సందర్శించే వారికి గిరిజనులు ఆచార వ్యవహారాలను పరిచయం చేయడానికి అరకులోయలోని గిరిజన మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో గిరిజనుల జీవన విధానానికి సంబంధించిన అనేక రకాల ప్రతిమలను ఏర్పాటు చేశారు. అయితే విశాఖ మన్యాన్ని సందర్శించే పర్యాటకులకు గిరిజనుల జీవ విధానాన్ని ప్రతిమల రూపంలో కాకుండా, పర్యాటకులే గిరిజనుల వేషధారణల్లో, వారి జీవన విధానాన్ని అనుసరిస్తూ, గిరిజనులు ఇలా ఉంటారని స్వయంగా అనుభూతి పొందేలా పర్యాటక ప్రాజెక్టును రూపొందించాలని 2018లో ఐటీడీఏ పీవోగా పని చేసిన డీకే.బాలాజీ ఆలోచనకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడంతో సుమారుగా రూ.కోటి వ్యయంతో అరకులోయకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో గిరి గ్రామదర్శిని రూపుదిద్దుకుంది. గిరిజన గ్రామాన్ని పోలేలా గడ్డి పైకప్పుగా వేసి, మట్టితోనే గిరిజన గృహాలను నిర్మించారు. అక్కడికి వచ్చిన పర్యాటకులు గిరిజనుల వేషధారణతో, గిరిజనులు నిత్య జీవనంలో చేసే అన్ని పనులను చేయవచ్చు. అలాగే ఇందులో గిరిజన సంప్రదాయ వివాహం చేసుకోవడం ఓ ప్రత్యేకత. సందర్శకులు అక్కడ బస చేసేందుకు ప్రత్యేకమైన రిసార్టులు, భోజనాలు చేసేందుకు రెస్టారెంట్ సదుపాయాలున్నాయి.

గిరి సంప్రదాయంలో వివాహ వేడుక

వివాహం చేసుకుందామనుకునే(సందర్శకులు)వధూవరులను వేర్వేరు ఇళ్లలో ఉంచి, గిరిజనుల వలే వస్త్రధారణ చేయిస్తారు. పెళ్లి కుమార్తెకు అడ్డుకట్టు చీర కట్టి, సంప్రదాయ ఆభరణాలతో అలంకరిస్తారు. అలాగే పెళ్లి కుమారుడికి పంచె, తలపాగా కట్టి, కండువా వేస్తారు. వధూవరులకు పెళ్లి చేసే గురువు తొలుత దోష నివారణకు శంకు దేవుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. తరువాత వారిద్దరిని వివాహ మండపం వద్దకు తీసుకువచ్చి పెళ్లి పీటలపై కూర్చోబెడతారు. అలాగే గిరిజన సంప్రదాయ వాయిద్యాలను వాయిస్తారు. గిరిజన సంప్రదాయ పెళ్లి మంత్రాలు ఉచ్చరించి, వరుడితో వధువుకు తాళిబొట్టు కట్టిస్తారు. తలంబ్రాలు పోసుకోవడం, నీళ్ల బిందెలతో ఉంగరాలాట ఆడించడం వంటివి చేస్తారు.


గిరి గ్రామదర్శినిలో గిరిజనుల వేషధారణలో పలువురు పర్యాటకులు



తరువాత వధూవరులు తమ ముఖాలకు పరస్పరం పసుపును రాసుకుంటారు. దీంతో వివాహ తంతు ముగుస్తుంది. నూతన వధూవరులను వివాహ మండపం చుట్టూ ఏడు మార్లు ప్రదక్షణ చేయించి, పెళ్లి కుమారుడికి కేటాయించిన ఇంటినే అత్తారింటిగా భావించి, నూతన వధువును అత్తారింటిలోకి ప్రవేశించే ప్రక్రియను చేస్తారు. వారి వివాహాన్ని పురస్కరించుకుని అందరూ కలిసి గిరిజన సంప్రదాయ థింసా నృత్యం ప్రదర్శిస్తారు. అలాగే నూతన వధూవరులతోపాటు పెళ్లికి హాజరైన అందరికీ స్థానిక వంటకాలతో విందు ఏర్పాటు చేస్తారు. గిరిజనులు పండించే దంపుడు బియ్యంతో అన్నం, కొండ కందులు, గుమ్మడికాయ ముక్కలతో పులుసు చేసి విందుకు హాజరైన వారికి భోజనాలు పెడతారు. పెద్ద పెద్ద ఫంక్షన్ హాళ్ల, వీఐపీల తాకిడి, రూ.లక్షల వ్యయంతో జరిగే సాధారణ వివాహానికి భిన్నంగా విహార యాత్రలో ఆటవిడుపుగా గిరిజన సంప్రదాయంతో చేసే ఈ వివాహం చేసుకోడానికి అరకులోయకు వచ్చే సందర్శకులు అమితంగా ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ వివాహాలు చేసుకున్నవారిలో ఎందరో ప్రముఖులు ఉన్నారు. సుప్రీం కోర్టు మాజీ చీఫ్ జస్టిస్ దంపతులు, ఉన్నతాధికారులు గిరిజన సంప్రదాయంలో వివాహం చేసుకుని ఫొటోలు దిగి సరదాగా గడిపారు.

ఎలా వెళ్లాలంటే...

అరకులోయ పట్టణం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో పెదలబుడు వద్ద గిరి గ్రామదర్శిని ఉంది. అక్కడికి వెళ్లేందుకు చక్కని తారురోడ్డు సదుపాయం ఉంది. దీంతో సొంత వాహనాల్లోనూ చేరుకోవచ్చు. అలాగే అరకులోయ నుంచి అక్కడికి వెళ్లేందుకు ఆటోలు, ప్రైవేటు ట్యాక్సీలు అందుబాటులో ఉంటాయి.

ఉక్కిరిబిక్కిరి చేసే

న్యుమోనియా

చిన్నారుల్లో వైరల్, బాక్టీరియా ఇన్‌ఫెక్షన్స్‌తో వ్యాప్తి

» కేజీహెచ్ ఓపీకి ప్రతిరోజూ 20 కేసులు

» ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రిలోనూ అదే పరిస్థితి

» స్మోకింగ్, ఆల్కహాల్ అలవాటున్న వారిలో అధికం

» నేడు ప్రపంచ న్యుమోనియా డే



విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

న్యుమోనియా చిన్నారులతోపాటు పెద్దలను ఉక్కిరిబిక్కిరి చేసే ఆరోగ్య సమస్య. ఊపిరితిత్తుల్లో కఫం చేరడాన్ని న్యుమోనియాగా పిలుస్తారు. కొన్ని రకాల బాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్స్ దీనికి కారణం. ఆల్కహాల్, స్మోకింగ్ అలవాటున్న వారిలో తీవ్రత అధికమని నిపుణులు చెబుతున్నారు. శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ప్రధాన సమస్య. గుర్తించడంలో ఆలస్యమైతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. నేడు ప్రపంచ న్యుమోనియా డే సందర్భంగా కథనం.

న్యుమోనియాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా ప్రత్యేక థీమ్ రూపొందిస్తారు. ఈ ఏడాది ప్రతి శ్వాసకు లెక్క. గుర్తించడం ద్వారా నియంత్రించవచ్చు థీమ్‌తో నిర్వహిస్తున్నారు. న్యుమోనియా వల్ల ఏటా ప్రపంచ వ్యాప్తంగా లక్షల మంది మృతి చెందుతున్నారు. చిన్నారుల్లో సమస్య తీవ్రత అధికమవుతుండడంతో అవగాహన కల్పించేందుకు వీలుగా 2009 నుంచి ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఇన్‌ఫెక్షన్స్‌తో ముప్పు

న్యుమోనియా అంటు వ్యాధి. దగ్గు, తుమ్ముల ద్వారా వ్యాప్తి చెందుతుంది. బాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్స్‌తో సమస్య అధికమవుతోంది. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం ఏటా 14 లక్షల మంది చిన్నారులు న్యుమోనియాతో మృతి చెందుతున్నారు. పెద్దల్లో వాయు కాలుష్యం, చల్లని గాలిలో తిరగడం, చల్లని నీళ్లు తాగడం, స్మోకింగ్, మద్యపానం న్యుమోనియాకు కారణమవుతున్నాయి.

నివారణ సాధ్యమే..

సకాలంలో గుర్తించి వైద్యం తీసుకుంటే మందులతోనే నయం చేయవచ్చు. ఆలస్యంగా గుర్తిస్తే కొన్నిసార్లు ఐసీయూ, వెంటిలేటర్ వరకు వెళ్లాల్సి ఉంటుంది. దగ్గు, కఫం రెండు, మూడు రోజులకు మించి వేధిస్తుంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి, ఎక్స్‌రేలు తీయించుకోవాలి. ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సులభం.

ప్రతిరోజూ 30 కేసులు



ఆస్పత్రిలో ఓపీకి రోజుకు 30 వరకు కేసులు వస్తుంటాయి. యువతలో సమస్య అధికంగా కనిపిస్తోంది. 40 ఏళ్లలోపు వారిలో 30 శాతం కేసులు నమోదవుతున్నాయి. షుగర్ వల్ల కొందరిలో సమస్య కనిపిస్తోంది. అలసత్వం ప్రదర్శిస్తే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది. కఫం, దగ్గు మూడు, నాలుగు రోజులకు మించి ఉంటే వైద్యులను సంప్రదించాలి. ఈ సీజన్‌లో వైరస్, బాక్టీరియా యాక్టివ్ అవుతాయి. దీనివల్ల కేసులు నమోదవుతుంటాయి.

- డాక్టర్ రఘుమండ సునీల్ కుమార్,
సూపరింటెండెంట్, ప్రభుత్వ ఛాతి, అంటువ్యాధుల ఆస్పత్రి

పిల్లల్లో సమస్య అధికం



పుట్టిన చిన్నారి నుంచి 60 ఏళ్ల వయసు వరకు ఎవరికైనా న్యుమోనియా రావచ్చు. దీనికి వైరస్‌లు, బాక్టీరియాలు కారణం. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారుల్లో సమస్య తీవ్రత అధికం. లంగ్స్‌లో కఫం చేరి ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. ఒక్కోసారి హార్ట్ ఫెయిల్యూర్ అవుతుంది. పిల్లలకు పక్కలు ఎగరేయడం, శ్వాస అధికంగా తీసుకోవడం లాంటి లక్షణాలుంటే వైద్యులకు చూపించడం మేలు.

-డాక్టర్ బీఎస్ చక్రవర్తి,
పీడియాట్రిక్ విభాగాధిపతి, కేజీహెచ్

చిల్డ్రన్స్ ఎరీనాలో 14 నుంచి బాలల కార్యక్రమాలు

సిరిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఈనెల 14 నుంచి బాలల సంబంధిత కార్యక్రమాలు పునఃప్రారంభమవుతాయని కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. నెహ్రూ జయంతి (బాలల దినోత్సవం) పురస్కరించుకుని ఇకపై ప్రతి 15 రోజులకోసారి పిల్లల కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. హౌ టూ గ్రిప్ ఆన్ ఇంగ్లీష్, పబ్లిక్ స్పీకింగ్, మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్, సైన్స్ టాపిక్స్, స్టోరీ టెల్లింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, క్విజ్, పది, ఇంటర్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై ఉచితంగా తర్ఫీదు ఇప్పిస్తామన్నారు. చిన్న పిల్లల చిత్రాలను ప్రదర్శిస్తామని, బాలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉక్కు ఎస్ఎంఎస్ విభాగంలో రికార్డు స్థాయి ఉత్పత్తి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ (ఎస్ఎంఎస్)-1 విభాగంలో రికార్డు స్థాయి ఉత్పత్తి జరిగింది. ఆదివారం ఈ విభాగంలోని ఒక కన్వర్టర్‌లో 14 హీట్లు (పెద్ద సైజు కలిగిన ఇనుప దిమ్మలు) ఉత్పత్తి జరగ్గా, ఇదే కన్వర్టర్‌లో మూడు షిఫ్టులు కలిపి 37 హీట్లు ఉత్పత్తి జరగడంతో రికార్డు నమోదైంది. దీంతో విభాగం ఉద్యోగులను అధికారులు అభినందించారు.

ఐఓఎస్ అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీరామమూర్తి


డాక్టర్ శ్రీరామమూర్తిని అభినందిస్తున్న ప్రొఫెసర్ రవి రామలింగం

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ సొసైటీ ఆఫ్ ఓటాలజీ (ఐఓఎస్) జాతీయ అధ్యక్షుడిగా నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.శ్రీరామమూర్తి నియమితులయ్యారు. ఆగ్రాలో జరిగిన అసోసియేషన్ వార్షిక సదస్సులో ఎన్నుకున్నారు. ఓటాలజీ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కేకే రామలింగం సమక్షంలో చెన్నైకు చెందిన ప్రొఫెసర్ రవి రామలింగం నుంచి శ్రీరామమూర్తి బాధ్యతలు స్వీకరించారు. అధునాతన వైద్య పద్ధతులను ఎక్కువ మంది వైద్యుల వద్దకు తీసుకెళతామన్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు, అసోసియేషన్ ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపండి: కలెక్టర్


వినతులు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే వినతులకు నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 301 వినతులు స్వీకరించినట్టు తెలిపారు. ఇందులో రెవెన్యూ విభాగానికి సంబంధించి 113, జీవీఎంసీ 59, పోలీసు శాఖ 17, ఇతర శాఖలకు సంబంధించి 112 అర్జీలున్నట్టు తెలిపారు. తొలుత గత వారం వచ్చిన ఫిర్యాదులపై అధికారులు తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారంపై మరింత శ్రద్ధ చూపి నిర్ణీత సమయంలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులు పెండింగ్‌లో ఉంటే ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరించాలని, శాఖల మధ్య, న్యాయస్థానంలో వివాదంలో ఉంటే పరిష్కారమార్గం చూడాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, అధికారులు పాల్గొన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న ఎంజీఎం, సెవెన్ హిల్స్ ఆసుపత్రుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆందోళన నిర్వహించి అనంతరం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సీనియర్ కార్మికులను తొలగించి జూనియర్లను కొనసాగించడం చట్టవిరుద్ధమని, నోటీసులను వెనక్కి తీసుకొని బకాయి జీతాలు అపరాధ రుసుముతో చెల్లించాలని డిమాండ్ చేశారు.

పోలీసు కమిషనరేట్‌కు 75 వినతులు

మహారాణిపేట: పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 75 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పరిష్కారంలో అలసత్వం వద్దని సూచించారు. సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు.

13 నుంచి విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక సదస్సులు

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని పలాస,విశాఖపట్నం జోన్-2, రంపచోడవరం, జంగారెడ్డిగూడెం డివిజన్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ప్రాంతాల్లో సదస్సులు నిర్వహించనున్నట్టు వేదిక చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ పేర్కొన్నారు. పలాస డివిజన్‌కు ఈనెల 13న ఇచ్ఛాపురం సెక్షన్, విశాఖపట్నం జోన్-2కు 19న మల్కాపురం సబ్ డివిజన్, రంపచోడవరం డివిజన్‌కు ఈనెల 28న అడ్డతీగల సెక్షన్, జంగారెడ్డి గూడెం డివిజన్‌కు సంబంధించి ఈనెల 28న కొయ్యలగూడెం సబ్‌డివిజన్‌లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఆయా రోజు ల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సదస్సులు జరుగుతాయన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో జాప్యం, తదితర సమస్యలపై సమస్యలను తెలియజేయవచ్చునన్నారు. అలాగే సీతమ్మధారలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సీజీఆర్ఎఫ్ ఆఫీస్‌కు లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదులు చేయవచ్చునని పేర్కొన్నారు.

క్లాప్ వాహనాలపై అధికారుల దృష్టి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో క్లాప్ వాహనాల పనితీరుపై అధికారులు దృష్టిసారించారు. వాహనాల పనితీరు గాడితప్పడంపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. ఈ మేరకు అన్ని జోన్ల కమిషనర్లు, ప్రజారోగ్యవిభాగం అధికారులు ఆరాతీయగా వాహనాల పనితీరు దారుణంగా ఉన్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో వాటి పనితీరుని పర్యవేక్షించడానికి సాంకేతికంగా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నట్టు కిందిస్థాయి సిబ్బంది చెప్పడంతో వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్టు సమాచారం. క్లాప్‌వాహనాలకు అమర్చిన జీపీఎస్ సక్రమంగా పనిచేసేలా చూడడంతోపాటు వాహనం ట్రాకింగ్‌ను బలోపేతం చేయాలని సిబ్బందిని ఆదేశించినట్టు తెలిసింది. అలాగే అన్నిజోన్ల ఎంఎస్ఎఫ్‌ల వద్ద వేయింగ్ బ్రిడ్జిలను ఆన్‌లైన్ చేయడంతోపాటు వాహనం బ్రిడ్జిపైకి రాగానే వాహనం బరువుతో కూడిన వివరాలను వాహనం నంబర్‌తోపాటు ప్రింట్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

భవన నిర్మాణ కార్మికుల చలో కలెక్టరేట్

» అడ్డుకున్న పోలీసులు

» జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పలువురి అరెస్టు


ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు



ర్యాలీగా వెళ్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

సిరిపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా ఉద్రికత్తకు దారితీసింది. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం చేపట్టిన మహాధర్నాలో భాగంగా కార్మికులు నిర్వహించిన చలో కలెక్టరేట్‌ను పోలీసులు అడ్డుకున్నారు. నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడిన చందంగా మారిందన్నారు. జగన్ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం 1996 అడ్డం పెట్టుకొని వెల్ఫేర్ బోర్డు పేరుతో నిర్మాణ యజమానులు, ప్రభుత్వ సంస్థల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి సొంత ప్రయోజనాలకు వాడుకున్నారని ఆరోపించారు. కార్మికులకు ఒక రూపాయి కూడా ఆర్థిక సహాయం చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇసుక పాలసీ మారుస్తామని, ఇసుక ఉచితంగా ఇస్తామని, సంక్షేమ బోర్డును పునః ప్రారంభించి కార్మికులను ఆదుకుంటామని చెప్పి, అవన్నీ మరిచిపోయిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం అమలు చేసి, కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోటా సత్తిబాబు, నాయకులు మదన్‌మోహన్, ప్రతాప్, కృష్ణారావు, రామకృష్ణ, సూర్యనారాయణ, ఈశ్వరరావు, యోగిం, సత్తిరాజు, సూరిబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

భర్త, అత్తలను అరెస్టు చేసిన పోలీసులు


ఢిల్లేశ్వరి (ఫైల్ ఫొటో)

సీతంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వరకట్న వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రామచంద్రనగర్‌లో జరిగింది. నాలుగోటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ సమీపంలోని చినమంగళాపురానికి చెందిన కడగల డిల్లీశ్వరి (25)కి అక్కయ్యపాలెంలోని రామచంద్రనగర్‌కు చెందినకడగల రాజశేఖర్‌తో 2002 ఫిబ్రవరి 4న వివాహం జరిగింది. ఆ సమయంలో రూ.18 లక్షల కట్నం, పది తులాల బంగారు ఆభరణాలు, పెళ్లి ఖర్చుల కింద మరో రూ.5 లక్షలు ఇచ్చారు. వివాహం అనంతరం డిల్లీశ్వరి, రాజశేఖర్‌లు అన్యోన్యంగా గడిపారు. ఈ క్రమంలో వారికి ఒక బాబు పుట్టాడు. ఆ తరువాత ఇంకా డబ్బు, బంగారం కావాలని అత్త, భర్త వేధించేవారు. ఇటీవల వ్యాపారం నిమిత్తం డబ్బులు కావాలని అడగడంతో డిల్లీశ్వరి తండ్రి కిమిడి సూరిబాబుకు తెలిపింది. దీంతో అప్పు తెచ్చి రూ.6 లక్షలు ఇచ్చారు. అయినప్పటికీ డిల్లీశ్వరిని కొట్టేవారని, ఒక్కోసారి ఇంటికి పంపేశారని ఆమె తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఇంటి నుంచి వెళ్లిపోవాలని, మరో పెళ్లి చేసుకుంటానంటూ డిల్లీశ్వరిని భర్త వేధించేవాడన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో అప్పట్లో పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. భర్త, అత్త వేధింపులు పెరగడంతో డిల్లీశ్వరి ఆదివారం ఇంట్లో ఉన్న వాస్మల్ 33ని తాగింది. విషయం తెలిసినా భర్త అత్తమామలు పట్టించుకోలేదు. అపార్ట్‌మెంట్ వాసులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందింది. దీంతో ఆమె తండ్రి సూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డిల్లీశ్వరి భర్త రాజశేఖర్, అత్త ఉమామహేశ్వరిల వేధింపులే కారణమని ఆరోపించారు. ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ ఎస్.విజయ్‌కుమార్ విచారించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. డిల్లీశ్వరి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

భవనం పైనుంచి జారిపడి కార్మికుడి మృతి

ఎండాడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనం పైనుంచి జారిపడి కార్మికుడు మృతి చెందాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బక్కన్నపాలెంలో ఉత్కర్ష క్యాపిటల్ వర్క్స్ డీ బ్లాక్‌లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులో పనిచేసే మైలపల్లి రాముడు (34) ఆదివారం మధ్యాహ్నం ఎనిమిదో అంతస్తులో నీటి పైపును లాగుతుండగా మూడోఅంతస్తులో ఉన్న ఇనుప చువ్వలపై పడి, అక్కడినుంచి సెల్లారులో ఉన్న లిఫ్ట్ పిట్ దగ్గర నీటిలో పడడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతన్ని కేజీహెచ్‌కి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. అతడి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎంసీకి డా.బాబూరావు పార్థివదేహం

విశాఖపట్నం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయిఫూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ (స్పెక్ట్) మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కె.బాబూరావు పార్థివ దేహాన్ని సోమవారం ఆంధ్రా మెడికల్ కళాశాల అనాటమీ విభాగానికి అందజేశారు. కుటుంబ సభ్యులు, స్పెక్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, సభ్యులు జి.కన్యాకుమారి, డాక్టర్ ఎస్.ఇందిర, స్వర్ణశైలజ, కె.బాలబాబు, తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 1961లో ఇదే కళాశాలలో వైద్యవిద్యను పూర్తిచేసిన బాబూరావు ఆదివారం మృతి చెందారు.

ముఖ్యమంత్రిని కలిసిన ప్రణవ్ గోపాల్


ముఖ్యమంత్రి చంద్రబాబును సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేస్తున్న ప్రణవ్ గోపాల్

వెంకోజీపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా తనకు అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటానని ప్రణవ్‌గోపాల్ అన్నారు. సోమవారం ఆయన అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తానని, విశాఖ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.